

బైపాస్‌రోడ్డు వద్ద తీగలమ్మచెరువులో ఎక్స్‌కవేటర్‌తో మట్టి తవ్వకాలు

మట్టి మాఫియా బరితెగిస్తోంది. అడ్డగోలు మట్టి తవ్వకాలతో ప్రకృతి సంపదను కొల్లగొడుతోంది. ఇలా పుంగనూరులో అక్రమార్కులు మట్టి కోసం చెరువులు, కొండలు, గుట్టలను యథేచ్ఛగా తవ్వేస్తున్నారు. పచ్చదనంతో ఉండే గుట్టలు, చెరువులు వీరి చేష్టలతో కొద్దిరోజులకే రూపుకోల్పోతున్నాయి. పట్టపగలే జాతీయ రహదారిపై విచ్చలవిడిగా టిప్పర్లు, ట్రాక్టర్లతో మట్టి తరలిపోతున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఎందుకంటే వారంతా అధికార పార్టీ నేతలు.. వారి వర్గీయులు కావడమే.

- పుంగనూరు

పుంగనూరులో మట్టిదోపిడీ


● తీగలమ్మ చెరువులో 15 మీటర్ల వరకు తవ్వకాలు ● బోగరబావిగుట్ట స్వాహా ● చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం

కర్నూలు- వేలూరు జాతీయ రహదారిలో రెండేళ్ల కిందట పుంగనూరు వద్ద బైపాస్‌రోడ్డు నిర్మించారు. ఈ నేపథ్యంలో బండ్లపల్లె రోడ్డు సమీపంలోని తీగలమ్మచెరువు మధ్యలో బైపాస్‌రోడ్డు ఉంది. ఇటీవల కొందరు పలుకుబడిగల వైసీపీ నాయకులకు తీగలమ్మ చెరువులోని మట్టిపై కన్నుపడింది. వెంటనే చెరువు మధ్యలో రోడ్డుకు ఉన్న మోరీకి రెండువైపులా నీళ్లు రాకుండా మట్టి అడ్డుకట్టగా వేశారు. చాలాకాలంగా ఎక్స్‌కవేటర్లు, ఇటాచీలతో మట్టి తవ్వకాలు ముమ్మరంగా చేపట్టారు. ట్రాక్టర్లు, టిప్పర్లతో వేల సంఖ్యలో మట్టి లోడ్లు వారి రియల్‌ఎస్టేట్‌లో భూమి ఎత్తుపెంచి చదునుచేసే పనులు జోరుగా సాగిస్తున్నారు. రాత్రింబవళ్లు మట్టి తవ్వకాలతో తీగలమ్మ చెరువు 10 నుంచి 15 మీటర్లులోతు గొయ్యిలు పడ్డాయి. సామాన్యులు ఎవరైనా ఓ ట్రాక్టర్ మట్టి కానీ ఇసుకకానీ అవసరాలకు తీసుకెళితే హడావుడిగా వలంటీర్లు, వీఆర్‌ఏ, వీఆర్వో, పోలీసు, ఎస్‌ఈబీ, అటవీశాఖ, మైన్స్ రెవెన్యూ తదితర శాఖల అధికారులు వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి కేసులు, జరిమానాలు విధించి సీజ్ చేయడం జరుగుతుంది. కానీ పర్యావరణానికి హాని కలిగేలా చెరువుల్లో నిబంధనలకు విరుద్ధంగా యంత్రాలతో భారీగా గోతులు తీసి ఓవైపు మట్టి, మరో వైపు ఇసుకను అక్రమంగా తరలిస్తున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. స్వయానా భూగర్భగనులు, అటవీ, పర్యావరణశాఖల మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న పుంగనూరు నియోజకవర్గం కావడం, అందులోనూ అధికారపార్టీకి చెందిన వారే మట్టి తరలింపులకు పాల్పడుతుండటంతో అధికారులు పట్టుకొనే సాహసం చేయడం లేదన్న విమర్శలున్నాయి.

● రాగానపల్లె చెరువు కింద 50 ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ చెరువులోనూ మట్టికోసం దాదాపు 10 అడుగులకు పైగా తవ్వేశారు. దీంతో చెరువు రూపురేఖలు కోల్పోయింది.



మట్టి తవ్వుకునేందుకు ఇబ్బంది లేకుండా చెరువులోకి నీళ్లు రాకుండా మోరీ వద్ద వేసిన అడ్డుకట్ట



భారీగా తవ్వేసిన తీగలమ్మచెరువు

చదును అవుతున్న గుట్ట



ఇది బోగరబావిగుట్ట. చిత్తూరు-మదనపల్లె జాతీయ రహదారి పక్కనే సుగాలిమిట్ట మలుపు వద్ద ఉంది. గతంలో చెట్లు, గడ్డితో పచ్చగా కళకళలాడేది. ఇటీవల నుంచి ఆ గుట్టను ఇటాచీ, ఎక్స్‌కవేటర్లతో తవ్వి మట్టి, రాళ్లను టిప్పర్లతో ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. దీతో ఈ గుట్ట నామరూపాలు లేకుండా పోతోంది. అలాగే నేతిగుట్లపల్లె, సుగాలిమిట్ట, ఎంసీపల్లె, చౌడేపల్లె తదితర ప్రాంతాల్లోని గుట్టలు, నియోజకవర్గంలో పలుచోట్ల చెరువులు మట్టి తవ్వకాలతో రూపుమారాయి. పుంగనూరులో అధికార పార్టీ నాయకులు ఇటీవల విచ్చలవిడిగా రియల్‌ఎస్టేట్ వ్యాపారాల్లో భూములు కొనుగోలు చేసి మట్టి తరలించే పనులు ముమ్మరం చేశారు.

మట్టి తవ్వకాలకు అనుమతి ఇవ్వలేదు

పుంగనూరు మండలంలో చెరువులు, గుట్టల్లో మట్టి తవ్వకాలకు మేము ఎవరికీ ఎలాంటి అనుమతి ఇవ్వలేదు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు చెరువుల్లో మట్టి తరలిస్తున్న విషయం మా దృష్టికి రాలేదు.

- సీతారామ్, తహసీల్దారు, పుంగనూరు

కాశీవిశ్వేశ్వరస్వామి మాన్యంలో అక్రమ నిర్మాణం

● పట్టించుకోని అధికారులు



ఆలయ మాన్యంలో నిర్మిస్తున్న నాలుగు అంతస్తుల భవనం

చౌడేపల్లె, జనవరి 9: కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ మాన్యం భూమిలో అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నా దేవదాయశాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. చౌడేపల్లె మండలం గోసల కురప్పల్లెలోని కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయానికి రూ.కోట్ల విలువ చేసే భూములు ఆక్రమణకు గురవుతున్నాయి. ఆలయానికి చెందిన మాన్యం భూమి స్థానిక బస్టాండులో ఉండటంతో మండలంలోనే అత్యంత విలువైన భూమి కావడంతో దీనిపై కొందరి దృష్టి పడింది. రాజకీయ అండ ఉండటంతో అడ్డుకునే వారే లేకుండా పోయారు. ఈ స్థలం , రియల్ ఎస్టేట్ వ్యాపారుల చేతులు మారుతూ- అక్రమ నిర్మాణాలు మొదలయ్యాయి. నడి బస్టాండులో ఉన్న అత్యంత విలువైన మాన్యం భూములు చేతులు మారుతున్నా దేవదాయశాఖ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. దేవుడి భూమికే దిక్కులేని పరిస్థితి మండలంలో నెలకుంది. జిల్లా అధికారులు స్పందించి ఆలయ మాన్యం అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రాకాసి గుట్టలో చిరుత సంచారం

తవణంపల్లె, జనవరి 9: తవణంపల్లె మండలం జొన్నగురకల గ్రామ సమీపంలో చిరుత సంచరిస్తుందనే సమాచారంలో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. గుట్ట పక్కన గల దారిలో సోమవారం ద్విచక్రవాహనంపై వెళ్తుండగా చిరుతను చూసినట్లు గ్రామంలోని ఒక వ్యక్తి చెప్పారు. దీంతో గ్రామస్తులు అటవీశాఖాధికారులకు సమాచారం అందించారు. ఈ మేరకు అటవీశాఖాధికారులు రాకాసి గుట్ట వద్దకు చేరుకొని పరిశీలించి చిరుత సంచారానికి సంబంధించి ఎటువంటి ఆనవాళ్లు కనపడలేదన్నారు. చిరుత సంచారంపై ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, చిరుత గురించి ఎటువంటి సమాచారం అందినా వెంటనే సమాచారం ఇవ్వాలని వారు తెలిపారు.

చిరుత సంచారం లేదు

చిత్తూరు (సెంట్రల్): జొన్న గొరకుల గ్రామంలో చిరుత సంచారం లేదని డీఎఫ్‌వో చైతన్యకుమార్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ ప్రాంతంలో విచారణ చేపట్టామని, చిరుత సంచారం లేనందున ప్రజలు భయాందోళనకు గురికారాదన్నారు.

ఎస్మాకు వెరవని అంగన్వాడీలు



కలెక్టరేట్ వద్ద రిలే దీక్ష చేస్తున్న అంగన్వాడీలు

4175 మందికి గాను విధుల్లో చేరింది 35 మంది

చిత్తూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీలు ఎస్మాకు భయపడలేదు. సోమవారంలోగా విధుల్లో చేరాలని ప్రభుత్వం డెడ్‌లైన్ విధించింది. అయినా, తమ డిమాండ్లను నెరవేర్చాల్సిందేనంటూ మంగళవారమూ నిరసనలు చేపట్టారు. మొత్తం 4175 మందికిగాను 35 మంది మాత్రమే విధుల్లో చేరారు. జిల్లాలో మెయిన్, మినీ అంగన్వాడీ కేంద్రాల్లో 2380 మంది టీచర్లు, 1795 మంది ఆయాలు పనిచేస్తున్నారు. ఈ అంగన్వాడీ కేంద్రాల పరిధిలో 11,593 మంది గర్భిణులు, 12,019 మంది బాలింతలు, 93,774 మంది చిన్నారులు ఉన్నారు. తమ 11 డిమాండ్లను నెరవేర్చాలంటూ గతనెల 12 నుంచి అంగన్వాడీలు సమ్మెలోకి వెళ్లడంతో ఆయా కేంద్రాలు మూతపడ్డాయి. దీంతో 29 రోజులుగా గర్భిణులకు, చిన్నారులకు పౌష్టికాహారం అందడం లేదు. సమ్మె ప్రారంభించిన తొలి రోజుల్లో మంత్రివర్గ సబ్‌కమిటీ జరిపిన చర్చల్లో డిమాండ్ల పరిష్కారానికి హామీ ఇవ్వకపోగా, సమ్మె విరమించాలని సూచించింది. దీంతో అంగన్వాడీలు సమ్మెను మరింత ఉధృతం చేశారు. ప్రభుత్వం కూడా మొండిగా ముందుకెళ్లి కొన్ని చోట్ల అంగన్వాడీ కేంద్రాల తాళాలను పగులగొట్టి స్వాధీనం చేసుకుంది. సచివాలయాల్లో పనిచేసే మహిళా పోలీసులు, డ్వాక్రా సంఘమిత్రలతో అంగన్వాడీ కేంద్రాలను నిర్వహించే ప్రయత్నం విఫలమైంది. అంగన్వాడీలూ వెనక్కి తగ్గలేదు. దీంతో ప్రభుత్వం ఎస్మా అస్త్రాన్ని తెరపైకి తెచ్చింది. జీవో 2 ఆధారంగా ఈ నెల 6న ఎస్మా చట్టాన్ని ప్రయోగించింది. సోమవారంలోగా విధుల్లో చేరకుంటే ఉద్యోగాల నుంచి తొలగిస్తామని హెచ్చరించింది. దీనిని అంగన్వాడీలు పట్టించుకోలేదు. కాగా, ఎస్మా చట్టంతో పాటు స్థానిక వైసీపీ నాయకుల బెదిరింపులతో జిల్లాలో 35 మంది సిబ్బంది విధుల్లో చేరినట్లు ఐసీడీఎస్ అధికారులు చెబుతున్నారు. అంటే ఈ చట్టంతో ఒక శాతం మంది ఉద్యోగులు కూడా భయపడలేదు. సమస్యలు తీరేదాకా సమ్మె విరమించేదే లేదని సింహభాగం అంగన్వాడీలు ఆందోళనలు కొనసాగిస్తున్నారు. వీరందరికీ నోటీసులు ఇచ్చేందుకు అధికారులు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

తిరుపతి జిల్లా అధికారులపై ఈసీ సీరియస్

● ఏపీలో అత్యధికంగా చంద్రగిరి, తిరుపతి నుంచే ఫిర్యాదులు

ఇన్ని ఫిర్యాదులు వస్తుంటే ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు?

ధోరణి మార్చుకోకుంటే తీవ్ర చర్యలు

తిరుపతి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో మంగళవారం ఓటర్ల జాబితా సవరణలపై సమీక్షించిన కేంద్ర ఎన్నికల సంఘం జిల్లా అధికారులపై సీరియస్ అయింది. విపరీతంగా ఫిర్యాదులు వస్తుంటే ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీసింది. ధోరణి మార్చుకోకుంటే తీవ్ర చర్యలు తప్పవని హెచ్చరించింది. విజయవాడలో మంగళవారం రాష్ట్రంలో జిల్లాల వారీగా ముఖ్య అధికారులతో ఎన్నికల సంఘం కమిషనర్లు సమీక్ష నిర్వహించారు. విశ్వసనీయ సమాచారం మేరకు తిరుపతి జిల్లాపైనే ప్రధానంగా ఎన్నికల సంఘం దృష్టి సారించింది. రాష్ట్రంలోనే అత్యధికంగా తిరుపతి జిల్లా నుంచే ఫిర్యాదులు అధికంగా వస్తున్నాయని, దీనికి కారణాలేమిటని ప్రశ్నించింది. చంద్రగిరి, తిరుపతి నియోజకవర్గాల నుంచీ విపరీతంగా ఫిర్యాదులు అందుతున్నా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీసింది. అనర్హుల ఓట్లు తొలగించాలని ప్రతిపక్ష పార్టీల నుంచీ అభ్యంతరాలు అందితే ఎందుకు పరిశీలించడం లేదని ప్రశ్నించింది. అభ్యంతరాలలో పేర్కొన్న పేర్లు డ్రాఫ్ట్ జాబితాలో మళ్ళీ కొనసాగుతుండడం పట్ల విస్మయం వ్యక్తం చేసింది. ఇదే ధోరణితో వుంటే ఎన్నికల షెడ్యూలు విడుదలయ్యాక తీవ్ర చర్యలు వుంటాయని హెచ్చరించింది. చంద్రగిరి, తిరుపతి నియోజకవర్గాల్లో వచ్చిన ఫిర్యాదులు, అభ్యంతరాల మీద గడువు లోగా చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. చంద్రగిరి, తిరుపతి, శ్రీకాళహస్తి తదితర నియోజకవర్గాల్లో ఓటర్ల జాబితాలో అవకతవకల గురించి ఆయా నియోజకవర్గాల నుంచీ అందిన అసంఖ్యాక ఫిర్యాదులతో గత నెలలో సమీక్షించినపుడే ఎన్నికల సంఘం జిల్లా అధికార యంత్రాంగాన్ని స్పష్టంగా హెచ్చరించిన సంగతి తెలిసిందే. ఇపుడు ఏకంగా టీడీపీ, జనసేన పార్టీల అధ్యక్షులు చంద్రబాబు , పవన్ కళ్యాణ్‌లే నేరుగా ఫిర్యాదు చేయడంతో కేంద్ర ఎన్నికల సంఘం తీవ్రంగా పరిగణించినట్టు సమాచారం. దానికి తోడు ఎన్నికల కమిషన్ రాష్ట్రానికి వచ్చిన సమయంలోనే చంద్రగిరి టీడీపీ ఇంచార్జి పులివర్తి నానీ ఓటర్ల నమోదులో అక్రమాలపై ఆమరణ నిరాహార దీక్షకు దిగడం, పోలీసులు అడ్డుకోవడంతో పెట్రోలు పోసుకుని ఆత్మహత్యకు యత్నించడం వంటి ఘటనలు కమిషన్ దృష్టికి వెళ్ళాయి. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకున్న ఎన్నికల సంఘం మంగళవారం జరిపిన సమీక్షలో అధిక సమయం తిరుపతి జిల్లాకే కేటాయించి లోతుగా వివరాలు రాబట్టినట్టు సమాచారం. ఆ క్రమంలో జిల్లా అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. గడువులోగా చంద్రగిరి, తిరుపతి సెగ్మెంట్లలో అందిన అభ్యంతరాలు, ఫిర్యాదులపై జిల్లా యంత్రాంగం ఏ మేరకు చర్యలు తీసుకుంటుందో వేచి చూడాల్సి వుంది. ఒక వేళ చర్యలు తీసుకోవడంలో ఉదాసీనంగా వ్యవహరిస్తే మాత్రం తీవ్ర మూల్యం చెల్లించాల్సి వుంటుందని జిల్లా ఉద్యోగ, అధికార వర్గాలు భావిస్తున్నాయి.

మీరిచ్చిన చీరలు ఉరేసుకోవడానికా?

● కుప్పంలో అంగన్వాడీల వినూత్న నిరసన

కుప్పం, జనవరి 9: మీరిచ్చిన చీరలు ఉరేసుకోవడానికి తప్ప దేనికీ పనికిరావంటూ అంగన్వాడీలు ధ్వజమెత్తారు. ఆ యూనిఫామ్ చీరలను మెడకు చుట్టుకుని ఆత్మహత్య చేసుకోవడానికే ఉపయోగపడతాయంటూ మంగళవారం వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఇటీవల కుప్పంలో ఒక కార్యక్రమంలో పాల్గొడానికి వచ్చిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి.. అంగన్వాడీల డిమాండ్లను విన్నారో లేదో కాని, రూ.16 కోట్లతో యూనిఫామ్ (చీరలు) ఇచ్చామని మాట్లాడారు. అప్పటి మంత్రి వ్యాఖ్యలను గుర్తుంచుకున్న అంగన్వాడీలు మంగళవారం అదే యూనిఫామ్ చీరలతో ఉరివేసుకోవడం ద్వారా ప్రభుత్వంపై తీవ్ర నిరసన తెలిపారు. చీరలు పరమనాసిరకంగా ఉన్నాయని, ఇవి ఉరివేసుకోవడానికి కూడా పనికిరావని వ్యాఖ్యానించారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేని జగన్‌రెడ్డి పాలనలో తమకు ఉరివేసుకుని ప్రాణాలు తీసుకోవడమే మిగిలిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్మా ప్రయోగించినా తాము భయపడేది లేదన్నారు. పోరాటం ఆపబోమని స్పష్టం చేశారు.

చిత్తూరు: జిల్లాలో అంగన్వాడీల సమ్మె మంగళవారానికి 29వ రోజుకు చేరింది. కలెక్టరేట్ వద్ద రిలే నిరాహార దీక్షలు కొనసాగించారు. ఇలాంటి ఎస్మా చట్టాలను అంగన్వాడీ యూనియన్ చాలా చూసిందని, తమను బెదిరించాలనుకుంటే ఇంటికి పంపిస్తామని నాయకులు హెచ్చరించారు. పలమనేరులో అంగన్వాడీలు నిరసన కొనసాగించారు. పుంగనూరులో సీడీపీవో కార్యాలయం వద్ద ధర్నా చేశారు.



కుప్పంలో ఉరివేసుకుని నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

ఆర్‌ఏఆర్ఎస్‌కి అవార్డు


సర్టిఫికెట్ అందుకుంటున్న ఏడీఆర్ రమణ, శాస్త్రవేత్తలు

తిరుపతి(విద్య), జనవరి 9: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయవర్సిటీ పరిధిలో తిరుపతిలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం (ఆర్‌ఏఆర్ఎస్) వరుసగా మూడో ఏడాదీ ఉత్తమ పరిశోధనా స్థానం అవార్డును కైవసం చేసుకుంది. గుంటూరులోని వర్సిటీ కేంద్రంగా మంగళవారం నిర్వహించిన 53వ పరిశోధనా, విస్తరణ సలహామండలి సమావేశంలో వీసీ ప్రొఫెసర్ శారదా జయలక్ష్మి, అగ్రిమిషన్ వైస్ చైర్మన్ నాగిరెడ్డి, రాష్ట్ర మార్కెటింగ్ సలహాదారులు బి.బ్రహ్మానందరెడ్డి చేతులమీదుగా బెస్ట్ రీసెర్చ్ స్టేషన్ సర్టిఫికెట్‌ను ఏడీఆర్ డాక్టర్ సి.రమణ అందుకున్నట్లు ప్రకటించారు. రమణ మాట్లాడుతూ.. మూడో ఏడాదీ అవార్డు అందుకోవడం సంతోషంగా ఉందన్నారు. శాస్త్రవేత్తలు, ఉద్యోగుల సమన్వయంతో సాధించామని తెలిపారు. వర్సిటీ అధికారులు, ఈసీ సభ్యులు, ప్రధానశాస్త్రవేత్తలు డాక్టర్ కృష్ణారెడ్డి, డాక్టర్ పి.బాలహుస్సేన్‌రెడ్డి, డాక్టర్ నాగమాధురి, డాక్టర్ టి.ప్రతిమ, డాక్టర్ జాన్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీయూకు నైలెట్ కేంద్రం మంజూరు

రూ.8.5 కోట్ల పరిశోధన ప్రాజెక్టుకు పచ్చ జెండా

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 9: ఎస్వీ యూనివర్సిటీకి రూ.8.5 కోట్ల పరిశోధన ప్రాజెక్టు మంజూరైంది. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (నైలెట్) కేంద్రాన్ని కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రితోపాటు సంబంధిత ఉన్నతాధికారులతో ఎంపీ గురుమూర్తి సంప్రదించి ఈ కేంద్రం మంజూరుకు కృషి చేశారు. యూనివర్సిటీలో నైలెట్ కేంద్రం ఏర్పాటుకు సాధ్యాసాధ్యాలను ఓ కమిటీని అధ్యయనం చేసింది. ఈ కమిటీ నివేదిక ఆధారంగా కేంద్రం పచ్చజెండా ఊపింది. చెన్నైలోని నైలెట్ ఈ ప్రాజెక్టును నిర్వహించేలా కేంద్రం మార్గదర్శకాలను రూపొందించినట్టు తెలుస్తోంది. ఈ కేంద్రం రాకతో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించే పలు కోర్సులను నిర్వహించే అవకాశం ఏర్పడుతుంది. పైగా తైవాన్, జపాన్, కొరియా, చైనా వంటి దేశాల్లోని పలు సంస్థలతో ఒప్పందాలను కుదుర్చుకుని కోర్సుల నిర్వహణ, ఉపాధి కల్పన అంశాల్లో పరస్పర సహకారంతో తిరుపతి ప్రాంత విద్యార్థులు విదేశాల్లో ఉన్నత విద్య, ఉపాధి అవకాశాలు పొందే అవకాశం ఉంటుంది. కేంద్రం ఏర్పాటైన మూడేళ్ల నుంచి ఏటా వెయ్యి మంది విద్యార్థులు శిక్షణ పూర్తి చేసుకుని, వెలుపలకు రానున్నారు. ఈ కేంద్రం మంజూరకు సహకరించిన సీఎం జగన్‌కు, కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ఎంపీ గురుమూర్తి కృతజ్ఞతలు తెలిపారు.

పంటలపై ఆగని గజదాడులు



ఏనుగుల దాడుల్లో ధ్వంసమైన కొబ్బరిచెట్లు.. అరటిచెట్లు

కల్లూరు, జనవరి 9: పులిచెర్ల మండలంలో పంటలపై ఏనుగుల దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. రెడ్డివారిపల్లి, కమ్మపల్లి పంచాయతీల్లో సోమవారం రాత్రి కొబ్బరి, అరటి, మామిడి, మిరప తదితర పంటలను ఏనుగుల గుంపు ధ్వంసం చేశాయి. నిన్నటి వరకు వ్యవసాయ పొలాల్లో సంచరిస్తూ పంటలను తొక్కేసిన ఏనుగులు సోమవారం రాత్రి రెడ్డివారిపల్లి పంచాయతీ వంకమద్దివారిపల్లిలో హల్‌చల్ చేశాయి. గ్రామం సరిహద్దులోకి చేరుకున్న ఏనుగులు గ్రామం చుట్టూ ఉన్న అరటిచెట్లను విరిచేశాయి. శిద్దారెడ్డికి చెందిన 30.. శ్రీనివాసులురెడ్డికి చెందిన 5 కొబ్బరిచెట్లను విరిచేశాయి. కమ్మపల్లికి చెందిన దామోదర్‌నాయుడు, రెడ్డిశేఖర్‌నాయుడు అరటి, మిరప పంటలను ఏనుగులు ధ్వంసం చేశాయి. ఇటీవల ఏనుగుల దాడులతో పంటలను కోల్పోయిన బాధిత రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రాష్ట్ర తెలుగు రైతు ఉపాధ్యక్షుడు రామనాధంనాయుడు డిమాండ్ చేశారు.

విధుల్లోకి సమగ్రశిక్ష ఉద్యోగులు

చిత్తూరు (సెంట్రల్), జనవరి 9: తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ 20 రోజులుగా సమ్మె చేసిన సమగ్రశిక్ష కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు అనివార్య కారణాలతో మంగళవారం సమ్మెకు తాత్కాలిక విరామం ప్రకటించారు. ఈ మేరకు సమగ్రశిక్ష ఏపీసీ వెంకటరమణారెడ్డిని కలిసి తాత్కాలిక విరామం ప్రతిని అందజేశారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.89 కోట్లు

తిరుమల, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.89 కోట్లు లభించింది. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ సోమవారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఈమేరకు ఆదాయం లభించినట్టు టీటీడీ మంగళవారం ఉదయం ప్రకటించింది. ఇక, సోమవారం 61,511 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. అలాగే 20,777 మంది తలనీలాలు సమర్పించారు.

యాక్టర్‌గా శిక్షణ పొందుతున్న చరిత్


కుటుంబ సభ్యులతో సుధీర్‌బాబు

తిరుమల, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): తన పెద్ద కుమారుడు చరిత్ మానస్ యాక్టర్‌గా శిక్షణ పొందుతున్నాడని సినీ హీరో సుధీర్ బాబు తెలిపారు. మంగళవారం ఉదయం కుటుంబ సమేతంగా తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. ఎక్కడికి వెళ్లినా తన కుమారుడు చరిత్‌ను ఎప్పుడు సినిమాల్లోకి తీసుకొస్తారని అడుగుతున్నారన్నారు. తను రావడానికి ఇంకా రెండుమూడేళ్లు పడుతుందన్నారు. అలాగే సూపర్‌స్టార్ కృష్ణకు ఎంతో ఇష్టమైన తన రెండో అబ్బాయి కూడా ఉన్నాడని, తమ ఫ్యామిలీ నుంచి ఫ్యూచర్ జనరేషన్ సెక్యూర్‌గా ఉందని నవ్వుతూ చెప్పారు. ఏడాదిలో రెండుసార్లు తిరుమలకు వచ్చి స్వామిని దర్శించుకోవడం ఆనవాయితీ అన్నారు. తెలుగు సినీ పరిశ్రమ, ప్రజలు బాగుండాలని స్వామిని కోరుకున్నట్టు తెలిపారు. 'మా నాన్న సూపర్ హీరో', 'హరోం హర' చిత్రాల షూటింగ్ చివరి దశకు చేరుకుందని, త్వరలోనే విడుదల తేదీలను ప్రకటిస్తామన్నారు.

ముక్కంటి ఆలయ మాస్టర్ ప్లాన్‌పై కసరత్తు


బిక్షాల గాలిగోపురం వద్ద పరిశీలిస్తున్న ఈవో రామారావు

శ్రీకాళహస్తి జనవరి 9: ముక్కంటి ఆలయ మాస్టర్ ప్లాన్‌పై మంగళవారం అధికారులు కసరత్తు చేశారు. మాస్టర్ ప్లాన్ డిజైన్ రూపొందించిన ద్రోణా సంస్థ ప్రతినిధులు మంగళవారం శ్రీకాళహస్తిలో పర్యటించారు. ఈవో రామారావు, ఇంజనీరింగ్ శాఖ అధికారులు, ద్రోణ ప్రతినిధులతో కలిసి మాస్టర్ ప్లాన్‌లో భాగంగా జరగబోయే నిర్మాణాలపై చర్చించారు. ఇందులో భాగంగా తేరువీధి, రాజగోపురం, బిక్షాల గాలిగోపురం, శివయ్య గోపురం, జలవినాయక కూడలి, సన్నిధి వీధి, టూరిస్టు బస్టాండు, గుడ్డేరు, భరద్వాజ తీర్థం ప్రాంతాల్లో స్థల పరిశీలన చేశారు. ఆయా చోట్ల మాస్ ప్లాన్ డిజైన్‌లో భాగంగా చేపట్టబోయే నిర్మాణాలపై అధ్యయనం చేశారు. ఈఈ నూక రత్నం, ఏఈ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పాత పింఛను అమలు చేసే పార్టీకే మద్దతు

మజ్దూర్ యూనియన్ నాయకులు

తిరుపతి(ఆటోనగర్), జనవరి 9: పాత పింఛను విధానం అమలు చేసేలా రాజకీయ పార్టీకే తమ మద్దతు ఉంటుందని దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ గుంతకల్ డివిజన్ అధ్యక్షుడు కె.సుదర్శన్ రాజు వెల్లడించారు. తిరుపతి రైల్వేస్టేషన్ ఎదుట మంగళవారం యూనియన్ తిరుపతి శాఖ ఏర్పాటు చేసిన రిలేదీక్షలను ఆయన ప్రారంభించి, ప్రసంగించారు. కేంద్ర ప్రభుత్వం నూతన పింఛను విధానం రద్దు చేసి.. పాత పింఛను విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై పోరాడటానికి దేశంలోని అన్ని కార్మిక సంఘాలు ఏకమై జాయింట్ ఫోరం ఫర్ రెస్టోరేషన్ ఆఫ్ ఓల్డ్ పెన్షన్ స్కీం (జేఎఫ్ఆర్‌వోపీఎస్)గా ఏర్పడ్డాయని చెప్పారు. ఈ సంఘానికి తమ ఫెడరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి శివగోపాల్ మిశ్ర కన్వీనర్‌గా వ్యవహరిస్తున్నారన్నారు. ఆయన పిలుపుతో భారత రైల్వేలో మంగళవారం నుంచి గురువారం వరకు రిలేదీక్షలు, నిరసనలు చేపట్టామన్నారు. నాయకులు డి.నారాయణస్వామి. మునిరత్నం, రవీంద్రనాయక్, గౌస్‌బాష, మారయ్య, దేవేంద్రనాథ్, శివకుమార్, జగదీష్, రోహిణి, వెంకటేష్, శ్రీనివాసులు పాల్గొన్నారు.


తొలగించిన ప్రభుత్వ బోరు - గ్రామానికి చెందిన భూమిని ఆక్రమించుకున్న దృశ్యం

వైసీపీ నాయకుల బరితెగింపు

తుమ్మిందలో ప్రభుత్వ స్థలం కబ్జా ● ఎంపీడీవో కార్యాలయం ముందు గ్రామస్తుల ధర్నా

చిత్తూరు రూరల్, జనవరి 9: చిత్తూరులో రోజు రోజుకు వైసీపీ నాయకులు బరితెగిస్తున్నారు. సెంటు ప్రభుత్వ భూమి కనపడినా కబ్జా చేసేందుకు వెనకాడడం లేదు. చిత్తూరు రూరల్ మండలంలోని ఆది ఆంధ్రవాడకు చెందిన ప్రభుత్వ భూమిని అదే గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు కబ్జా చేశారు. ఇప్పటికి ఆ స్థలం మీదుగా వెళ్తున్న మురుగునీటి కాలువను పూడ్చివేసి చదును చేశారు. మంగళవారం ఆ స్థలంలో 50 ఏళ్లుగా నీటిని అందిస్తున్న ప్రభుత్వ చేతి బోరును ఎక్స్‌కవేటర్‌తో పెరికించి ఆక్రమించారు. కాలువ పూడ్చివేయడంతో మురుగునీరు రోడ్డుపై పారుతూ దోమలకు ఆవాసంగా మారిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ప్రశ్నించిన గ్రామస్తులపై దౌర్జన్యం చేస్తున్నారని వాపోయారు. ఈ మేరకు మంగళవారం చిత్తూరు ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ప్రభుత్వ భూమి, బోరు ఆక్రమించుకున్న వైసీపీ నేతపై చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు. ఆక్రమణకు గురైన భూమిని స్వాధీనం చేసుకోవాలంటూ ఎంపీడీవో సుధాకర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు.


ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న గ్రామస్థులు

దొంగ ఓట్లు తొలగించరెందుకు?

ఆధార్‌తో అనుసంధానం చేసి గందరగోళానికి తెరదించండి - మున్సిపల్ కార్యాలయం ఎదుట టీడీపీ, జనసేన ఆందోళన



తిరుపతి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నియోజకవర్గంలో దొంగ ఓట్లను తొలగించాలని ఆధారాలతో సహా ఎన్నికల అధికారులకు పలుసార్లు ఫిర్యాదు చేసినా ఫలితంలేకుండా పోతోందని టీడీపీ, జనసేన నాయకులు మండిపడ్డారు. దొంగ ఓట్లు తొలగింపులో మౌనం దాల్చుతున్న అధికారుల తీరును నిరసిస్తూ మంగళవారం తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట టీడీపీ, జనసేన నాయకులు పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా టీడీపీ మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, తుడా మాజీ చైర్మన్ నరసింహ యాదవ్, నియోజకవర్గ పరిశీలకుడు సురేంద్ర కుమార్ మాట్లాడుతూ.. ముసాయిదా ఓటరు జాబితాలో గందరగోళంగా మార్పులు, చేర్పులను చేశారన్నారు. చనిపోయినవారి, నగరం నుంచి వెళ్లిపోయినవారి పేర్లను బీఎల్వోల సమక్షంలో గుర్తించి ఫిర్యాదు చేసినప్పటికీ ఇంకా వారు ఓటర్లుగా కనిపిస్తున్నారన్నారు. వైసీపీ దొంగ ఓట్లను నమ్ముకుని ఎన్నికలకు వెళుతోందని ఆరోపించారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక తిరుపతిలో జరిగిన కార్పొరేషన్, ఎంపీ ఉప ఎన్నిక, టౌన్ బ్యాంకు ఎన్నికలను అపహాస్యం చేశారన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ దొంగ ఓట్లు వేశారని, అయితే విద్యావంతులు తగిన బుద్ధి చెప్పారని గుర్తుచేశారు. ఓటరు కార్డుకు ఆధార్ కార్డుతో అనుసంధానం చేసి.. గందరగోళానికి తెరదించాలని కోరారు. తుది ముసాయిదా జాబితాలో దొంగ ఓట్లకు అవకాశం లేకుండా చూడాల్సిన బాధ్యత డీఆర్వో, ఈఆర్వో, ఏఈఆర్వోలపై ఉందని చెప్పారు. లేకుంటే న్యాయపరంగా పోరాడాల్సి వస్తుందని హెచ్చరించారు. సుగుణమ్మ నివాసం నుంచి ర్యాలీగా వచ్చి మున్సిపల్ కార్యాలయం ఎదుట బైఠాయించి ఆందోళన చేపట్టారు. దొంగ ఓట్లను తొలగించాలంటూ నినాదాలు చేశారు. అనంతరం డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో టీడీపీ నేతలు బీఎల్ సంజయ్, ఆర్సీ మునికృష్ణ, ఊకా విజయకుమార్, జేబీ శ్రీనివాస్, బుల్లెట్ రమణ, దంపూరి భాస్కర్, చినబాబు, మహేష్ యాదవ్, ఊట్ల సురేంద్ర నాయుడు, సింగంశెట్టి సుబ్బరామయ్య, సూరా సుధాకర్ రెడ్డి, జయరామ రెడ్డి, రుద్రకోటి సదాశివం, బ్యాంకు శాంతమ్మ, కంకణాల రజినీకాంత్ నాయుడు, ఆముదాల తులసి, ఇనుగొండ సుబ్రహ్మణ్యం, తిరుమల కేశవులు, మన్నెం శ్రీనివాసులు, ఆనంద్ యాదవ్, హేమంత్ రాయల్, కరాటే చంద్ర, రఘు, ప్రకాష్, ధర్మారెడ్డి, విశ్వనాథం, రాజారాం, కేవి రమణ, రేవతి, లత, జనసేన నాయకులు సుభాషిణి, రాజేష్ ఆచారి, చందన, దుర్గ, మునస్వామి తదితరులు పాల్గొన్నారు.



నగరపాలక కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న మున్సిపల్, ఇంజనీరింగ్ విభాగం కార్మికులు - భిక్షమెత్తుతున్న మున్సిపల్ కార్మికులు

ఈ ప్రభుత్వాన్ని నమ్ముకుంటే భిక్షమెత్తాల్సిందే

● చిత్తూరులో భిక్షాటన చేసిన మున్సిపల్ కార్మికులు

చిత్తూరు, జనవరి 9: న్యాయమైన కోర్కెల పరిష్కారం కోసం నగరపాలక సంస్థ పారిశుధ్య కార్మికులు, ఇంజనీరింగ్ విభాగం కార్మికులు చేపట్టిన సమ్మె మంగళవారంతో ఏడవ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా కార్మికులు భిక్షాటన చేసి నిరసన వ్యక్తం చేశారు. అధికారంలోకి రాకముందు జగన్ అనేక హామీలు ఇచ్చారని, వచ్చిన తరువాత ఒక్క హామీని నెరవేర్చకపోగా సమ్మె చేస్తున్న కార్మికులపై వైసీపీ ప్రభుత్వం బెదిరింపులకు దిగుతోందన్నారు. ప్రభుత్వాన్ని నమ్ముకోవడం వల్ల కార్మికులు భిక్షమెత్తుకోవాల్సిన పరిస్థితి దాపురించిందని వాపోయారు. ఈ సమ్మెలో సీపీఐ నాయకులు గోపీనాథ్, దాసరి చంద్ర, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు వాసు, సుగుణ, సురేష్, రమణి, తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన, పారదర్శకతకు పెద్దపీట

ఎస్వీయూ వీసీ శ్రీకాంత్‌రెడ్డి


అధికారులతో మాట్లాడుతున్న శ్రీకాంత్‌రెడ్డి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 9: సమయ పాలన, పారదర్శకతకు పెద్దపీట వేస్తామని ఎస్వీయూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ వి.శ్రీకాంత్ రెడ్డి స్పష్టం చేశారు. పలు సెక్షన్ల ఉన్నతాధికారులతో తన చాంబర్‌లో మంగళవారం సమీక్షించారు. సమయ పాలన, పారదర్శకత, 24 గంటల్లో ఫైళ్ల క్లియరెన్స్, సంపూర్ణ ఈ-ఫైలింగ్‌పై అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. వర్సిటీపై వస్తున్న విమర్శలన్నింటినీ తిప్పికొట్టేలా ప్రతి ఉద్యోగీ నిబద్ధత, అంకితభావంతో పని చేయాలని కోరారు. ఉద్యోగుల పనితీరుపై ఆయా సెక్షన్ అధికారులు నివేదిక సమర్పించాలని సూచించారు. ఈ-ఫైలింగ్ విధానాన్ని అన్ని విభాగాలకు విస్తరించాలని చెప్పారు. ప్రతి ఫైల్‌ను 24 గంటల్లో క్లియర్ చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. బోధన, పరిశోధన, విస్తరణ రంగాల్లో వేగవంతంగా నడిపించడానికి పటిష్ఠ చర్యలు తీసుకోక తప్పదని అభిప్రాయపడ్డారు. దీనికి డిప్యూటీ రిజిస్ట్రార్లు, అసిస్టెంట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లు దోహదం చేయాలని కోరారు. రిజిస్ట్రార్ హుస్సేన్, పరీక్షల విభాగం అధికారి దామ్లా నాయక్, డీఆర్‌లు, ఏఏవోలు పుష్పలత, లోకనాథం, చంద్రశేఖర్‌నాయక్, లక్ష్మీనారాయణ, సురేష్‌బాబు, శ్రీనివాసరాజు, చంద్రశేఖర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

21 కేజీల గంజాయి పట్టివేత

నలుగురు బెంగళూరు యువకుల అరెస్టు


గంజాయి నిందితుల వివరాలను వెల్లడిస్తున్న సెబ్ డీఎస్పీ రమేష్

నాయుడుపేట టౌన్, జనవరి 9 : అక్రమంగా తరలిస్తున్న 21 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ డీఎస్పీ రమేష్ తెలిపారు. నాయుడుపేట సెబ్ కార్యాలయంలో మంగళవారం పట్టుబడ్డ నిందితుల వివరాలను ఆయన వెల్లడించారు. సెబ్ సీఐ ప్రసాద్ వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో నాయుడుపేట ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో నలుగురు యువకులు అనుమానాస్పదంగా కన్పించడంతో వారిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి బ్యాగుల్లో 21 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకోవడంతో పాటు బెంగళూరుకు చెందిన కిరణ్, విక్రమ్, గౌడ్‌పాటిల్, శ్యామ్‌లను అరెస్టు చేసినట్లు తెలిపారు. పట్టుబడ్డ గంజాయి విలువ 3.15 లక్షలు ఉంటుందని తెలిపారు.

ఖజానా స్ట్రాంగ్‌రూముల్లోని వ్యర్థాలు తొలగించండి : జేసీ


సమావేశంలో మాట్లాడుతున్న జేసీ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 9: జిల్లా ఖజానా, ఉపఖజానా కార్యాలయాల్లో ఏళ్ల తరబడి నిల్వవుంచిన అనవసరమైన వాటిని వెనక్కి తీసుకోవాలని పలు శాఖల జిల్లా అధికారులను జేసీ శ్రీనివాసులు ఆదేశించారు. మంగళవారం సాయంత్రం జేసీ మీటింగ్ హాలులో వివిధశాఖల అధికారులతో సమావేశం జరిగింది. ఖజానా స్ట్రాంగ్‌రూమ్‌ల్లో విద్యాశాఖకు సంబంధించి వివిధ పరీక్షలకు వాడని ఆన్సర్ షీట్లు, ప్రశ్నపత్రాలు, జిల్లా పరిషత్తు, జిల్లా పంచాయతీ కార్యాలయాలకు సంబంధించి ఎన్నికల నామినేషన్ ఫారాలు, కవర్లు, చెక్‌బుక్కులు, కోర్టులకు సంబంధించి రిజిస్ట్రేషన్ కార్యాలయాల ద్వారా నిల్వవున్న జుడీషియల్, నాన్ జుడీషియల్ స్టాంపులు, కోర్టు ఫీ, నోటరీ, న్యాయవాదుల సంక్షేమ పత్రాలు, హుండీ పత్రాలు, ఇతరత్రా కార్యాలయాలకు సంబంధించి పత్రాలను వెంటనే అక్కడినుంచి తొలగించాలని చెప్పారు. ఇందుకు సంబంధించి జేసీ అధ్యక్షతన ఏడు మంది అధికారులతో కూడిన జిల్లాస్థాయి కమిటీని రాష్ట్ర ఆర్థికశాఖ ఏర్పాటు చేసిందని తెలిపారు. వెనక్కి తీసుకునేవి, తొలగించవలసినవి, తిరిగి అక్కడే భద్రపరచాల్సినవి అని మూడు విభాగాలుగా స్ట్రాంగ్‌రూమ్‌ల్లో నిల్వవున్న వస్తువులను విభజించి, వివరాలు అందజేయాలని చెప్పారు. న్యాయపరంగా సమస్యలు లేని ఫైళ్ళను కూడా అక్కడి నుంచి తొలగించాలని తెలిపారు. సమావేశంలో డీఆర్వో రాజశేఖర్, కమిటీ కన్వీనర్, జిల్లా ఖజానా డీడీ రామచంద్ర, జిల్లా రిజిస్ట్రార్ శ్రీనివాసరావు, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మి, డీఈవో విజయేంద్రరావుతో పాటు పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

స్వామి ముద్దు.. జ్ఞానేంద్ర వద్దు

పెనుమూరులో డిప్యూటీ సీఎం అనుకూలవర్గం కొత్త నినాదం


నారాయణస్వామికి మద్దతుగా ప్లకార్డులు చూపుతున్న వైసీపీ నేతలు

పెనుమూరు, జనవరి 9: 'జ్ఞానేంద్రరెడ్డి వద్దు..నారాయణస్వామి ముద్దు' అంటూ పెనుమూరు మండలం పులిగుండు ఏపీ టూరిజం ప్రాంగణంలో డిప్యూటీ సీఎం నారాయణస్వామి అనుకూలవర్గం మంగళవారం డిమాండ్ చేసింది. పెనుమూరు మండల పార్టీ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి సారధ్యంలో జరిగిన ఈ సమావేశంలో జ్ఞానేంద్రరెడ్డిపై తీవ్ర విమర్శలు చేశారు. మండలంలో జ్ఞానేంద్రరెడ్డి కుటుంబ సభ్యులు 300 ఎకరాలు భూ కబ్జా చేశారని వాటికి అడ్డుపడినందుకే నారాయణ స్వామిపై అసత్యప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ప్లకార్డులు పట్టుకుని జ్ఞానేంద్రరెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు యశోదారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కమలాకర్‌రెడ్డి, ఆరు మండలాల వైసీపీ అధ్యక్షులు, ఎంపీపీలు, జడ్పీటీసీలు పద్మనాభరెడ్డి, బండి హేమసుందర్‌రెడ్డి, తులసియాదవ్, తలాబాలజి, దనంజయవర్మ, సుకుమార్, జయచంద్రారెడ్డి, నవీన్‌రెడ్డి, గుణశేఖర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, మునిరాజారెడ్డి, మణి, కుప్పయ్య, గురవారెడ్డి, బాబు, శేఖర్‌యాదవ్, అన్బు, యతీశ్వర్‌నాయుడు, లక్ష్మీపతి పాల్గొన్నారు. ఈ సమావేశంతో నియోజకవర్గంలో వైసీపీలో వర్గ విభేదాలు మరింత ముదురుతున్నట్టు అర్థం అవుతోంది.

మద్యం మత్తులో యువకుల వీరంగం


చికిత్స పొందుతున్న మునిశేఖర్

శ్రీకాళహస్తి జనవరి 9: మద్యం మత్తులో పలువురు యువకులు వీరంగం సృష్టించిన ఘటన మంగళవారం తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి పట్టణంలోని ఎన్టీఆర్ నగర్ వద్ద చోటుచేసుకుంది. ఓ స్నేహితుని కార్యం కోసం పట్టణానికి చెందిన కొందరు యువకులు ఎన్టీఆర్ నగర్ వద్ద కలుసుకున్నారు. మద్యం మత్తులో వారి మధ్య వాగ్వాదం చోటు చేసుకుని పలువురు ఘర్షణకు దిగారు.. శ్రీకాళహస్తి పట్టణం మరాఠి పాలునికి చెందిన మునిశేఖర్ పంక్చర్ దుకాణం నిర్వహిస్తుంటాడు. ఇందులో మునిశేఖర్ ముఖంపై మద్యం సీసాతో దాడి జరిగిందని చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రిలో చేరాడు. భారీగా యువకులు ఆసుపత్రి వద్ద గుమిగూడారు. ఉద్రిక్త పరిస్థితులు ఎదురవకుండా పోలీసులు ఆస్పత్రి వద్దకు చేరుకుని అదుపు చేశారు.

కొనసాగిన మున్సిపల్ కార్మికుల సమ్మె



నిరసన దీక్ష చేస్తున్న మున్సిపల్ కార్మికులు

పలమనేరు, జనవరి9 : పలమనేరులో మున్సిపల్ కార్యాలయం ఎదుట మంగళవారం సైతం మున్సిపల్ కార్మికులు సమ్మె, నిరసన దీక్ష కొనసాగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమానపనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. కాంట్రాక్టు కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని కోరారు. వీరి ఆందోళనకు మంగళవారం ఏఐటీయూసీ నాయకులు సుబ్రమణ్యం, మానవహక్కుల సంఘం నాయకులు డీవీ మునిరత్నం, రాజ, రవికుమార్, సుబ్రమణ్యం, ఆనంద్, వెంకటరమణలతో పాటు మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు జాన్ఆనంద్, శ్రీనివాసులు, కార్మికులు పాల్గొన్నారు.

'భూమి ఇస్తామని మోసం చేశారు'

పుంగనూరు రూరల్, జనవరి9: భూమి ఇస్తామని మోసం చేసిన వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పుంగనూరు పోలీస్‌స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ కేశవరాజు కథనం మేరకు.. పట్టణంలోని ఎన్ఎస్.పేటకు చెందిన సిరాజ్అహ్మద్‌కు భూమి కొనుగోలు చేసి ఇస్తామని పట్టణానికి చెందిన మహ్మమద్, అంజాద్, మరో వ్యక్తి రూ. 7.80లక్షలు తీసుకున్నారు. తర్వాత భూమి కొనుగోలు చేసి వారిపేరుతోనే రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. విషయం తెలుసుకున్న సిరాజ్ అహ్మద్ పోలీసులను ఆశ్రయించాడు.

చంద్రబాబుతోనే రాష్ట్రానికి బంగారు భవిష్యత్



మాట్లాడుతున్న కరీముల్లా

రొంపిచెర్ల, జనవరి 9: టీడీపీ అధినేత చంద్రబాబు పాలనతోనే రాష్ట్రానికి బంగారు భవిష్యత్ వస్తుందని రాజంపేట పార్లమెంట్ మైనార్టీ నాయకులు షేక్ కరీముల్లా, జి.ఇమ్రాన్‌ఖాన్ పేర్కొన్నారు. మంగళవారం రొంపిచెర్లలో జరిగిన సమావేశంలో కరీముల్లా మాట్లా డుతూ పుంగనూరు నియోజకవర్గంలో టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి నిర్వహిస్తున్న బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. ఇదిచూసి కొంత మంది చల్లాబాబుపై విమర్శలు చేయడం తగదన్నారు. చల్లా బాబు విజయానికి ప్రజలు, నాయకులు, కార్యకర్తలు ఐకమత్యంగా కృషిచేయాల్సి ఉందన్నారు. ఈ సమా వేశంలో రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి పఠాన్ అంజాద్‌ఖాన్, రామమూర్తి, గౌస్‌పీర్‌ఖాన్, ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న నోడల్ అధికారి వెంకటప్రసాద్

బైరెడ్డిపల్లె, జనవరి 9: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని జిల్లా టీబీ, ఎయిడ్స్, లెప్రసీ నోడల్ అధికారి డాక్టర్ వెంకటప్రసాద్ తెలియజేశారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో మంగళవారం మహతి ఫౌండేషన్ చైర్మన్ నాగరాజు సహకారంతో గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. గర్భిణులు తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తల గురించి వివరించారు. అలాగే క్షయ, కుష్ఠు, రక్తహీనత నివారణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి విజయచందర్, సీహెచ్‌వో అనురాధ, ఆరోగ్య విద్యాధికారి సావిత్రి, డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ దయానంద, మహతి ఫౌండేషన్ ప్రతినిధులు తిమ్మక్క, శాంతమ్మ, శ్రీనివాసులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

బాలలను పనిలో పెట్టుకోవడం నేరం



బ్యానర్ ప్రదర్శిస్తున్న పోలీసు, న్యాయశాఖ, లేబర్ అధికారులు

పలమనేరు, జనవరి9 : బాలలను పనిలో పెట్టుకోవడం నేరమని పలమనేరు సీనియర్ సివిల్ జడ్జి పి.శ్రీనివాసరావు తెలియజేశారు. న్యాయమూర్తి ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని హోటళ్లు, టీకొట్లు, బేకరీలు, దుకాణాల్లో పోలీసు, న్యాయశాఖ సిబ్బంది, లేబర్ అధికారి మధుబాబు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. బాల కార్మికులను పనిలో పెట్టుకొంటే వారికి 6నెలల జైలుశిక్షతో పాటు రూ.40 వేలు జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలమనేరు పరిరక్షణ సమితి సభ్యులు, ఏఎస్ఐ పళని, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

పలమనేరు మార్కెట్ యార్డు సందర్శన



పలమనేరు, జనవరి9 : పలమనేరు మార్కెట్ యార్డును మంగళవారం మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులు సందర్శించారు. యార్డుకు వచ్చే కూరగాయల వివరాలు, రైతులకు ఉన్న సౌకర్యాలు, కూరగాయలకు అందే ధరల గురించి ఆరా తీశారు. అనంతరం మార్కెట్ యార్డు పరిధిలోని రాయలపేట, వి.కోట సమీపంలోని శివునికుప్పం మార్కెట్‌యార్డులను సందర్శించి అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. పనులు నాణ్యంగా, వేగంగా పూర్తిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కడప ఆర్‌జేడీఎం శ్రీరామాంజనేయులు, ఆర్‌డీడీఎం శ్రీకాంత్‌రెడ్డి, డీఏటీఎంవో పరమేశ్వరన్, పలమనేరు మార్కెట్ యార్డు అధ్యక్షులు హేమంత్‌కుమార్‌రెడ్డి, కార్యదర్శి సంజీవకుమార్, యార్డు పర్యవేక్షకులు జ్ఞానాంబ, రత్నమ్మ పాల్గొన్నారు.

అయోధ్య అక్షింతలకు పూజలు

సోమల, జనవరి 9: మండలంలోని నంజంపేటలో మంగళ వారం అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలకు రామా లయంలో పూజలు జరిపారు. అనంతరం రామ భక్తులు పురవీధుల్లో ఇంటింటా అక్షింతలను పంపిణీ చేశారు. అలాగే గొల్లపల్లె, సరస్వతీపురంలో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ నెల 22న అయోధ్యలో రాముల వారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంపై ప్రజలకు వివరించారు.

గ్యాస్ లీకేజీతో అగ్ని ప్రమాదం

పుంగనూరు రూరల్, జనవరి 9: పుంగనూరులోని తాటిమాకులపాళ్యంలో మంగళవారం ఓ ఇంట్లో గ్యాస్ లీకేజ్‌తో అగ్నిప్రమాదం జరిగినట్లు ఫైర్ ఆఫీసర్ సుబ్బరాజు తెలిపారు. వాసుదేవరెడ్డి ఇంటి వంటిగదిలో సిలిండర్ నుంచి గ్యాస్ లీకైంది. ఈ క్రమంలో మంటలు చెలరేగి రూ.20 వేలు విలువచేసే వాటర్‌ఫిల్టర్, వంటసామగ్రి దగ్ధమయ్యాయి.

ఎన్టీఆర్ ట్రస్టు వైద్య శిబిరం విజయవంతం



కుప్పం, జనవరి 9: కుప్పం మండలం వానగుట్టపల్లెలో మంగళవారం ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో 80 మంది రోగులకు బీపీ, షుగర్, ఇతర వ్యాధులకు వైద్య పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. డాక్టర్ మధు, ఝాన్సీరాణి, పార్థ సారథి వైద్య సేవలు అందించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



మద్యం, నిందితులతో సీఐ కిశోర్‌కుమార్ తదితరులు

కుప్పం, జనవరి 9: కుప్పంనుంచి కృష్ణగిరి వెళ్లే మార్గంలో మంగళవారం ఎక్సైజ్ పోలీసులు జరిపిన తనిఖీల్లో అక్రమంగా తరలుతున్న కర్ణాటక మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. కారులో సుమారు రూ.21,425 విలువ కలిగిన 51 లీటర్ల కర్ణాటక మద్యం ప్యాకెట్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. కారును సీజ్ చేశారు. ఈ మద్యం తరలిస్తున్న నిందితులు కంగుంది గ్రామానికి చెందిన ఎన్.మణికంఠన్, ఎం.కార్తీక్, పి.కిశోర్‌లపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎక్సైజ్ సీఐ కిశోర్‌కుమార్, ఎస్ఐ ఎ.రామమమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం



రామకుప్పం, జనవరి 9: రామకుప్పం మండలం రామాపురంతాండాకు చెందిన గోపాల్‌నాయక్ మంగళవారం అనారోగ్యంతో మృతిచెందారు. టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు, నేతలు మనోహర్, కామరాజనాయక్, బాబునాయక్ తదితరులు గోపాల్‌నాయక్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మృతుడి కుటుంబసభ్యులకు పార్టీ తరఫున రూ.10వేలు అందజేశారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

రామకుప్పం, జనవరి 9: పేకాట రాయుళ్లను పోలీసులు అరెస్టు చేశారు. ఎస్ఐ శివకుమార్ కథనం మేరకు.. రామకుప్పం మండలం గాంధీనగర్ సమీపంలో మంగళవారం నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసులు దాడిచేశారు. నలుగురిని అరెస్టు చేశారు. మరో నలుగురు పరారయ్యారు. 8మందిపై కేసులు నమోదు చేశారు. జూదరుల నుంచి రూ.1420 స్వాధీనం చేసుకున్నారు.

పేద పిల్లలకు దుస్తుల పంపిణీ



పుంగనూరు రూరల్, జనవరి9: లయన్స్‌క్లబ్ ప్రతినిధి డాక్టర్ సరళకుమారి జన్మదినం సందర్భంగా మంగళవారం మండలంలోని సింగిరిగుంట సమీపంలోని మున్సిపల్ కంపోస్ట్ యార్డులో జీవనం సాగిస్తున్న పిల్లలకు దుస్తులు, దుప్పట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ప్రతినిధులు సురేశ్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ బీమా చెక్కు పంపిణీ

పుంగనూరు రూరల్, జనవరి9: పట్టణంలోని కొత్తయిండ్లుకు చెందిన మృతు డు కరుణాకర్ కుటుంబానికి వైఎస్ఆర్ బీమా పథకం ద్వారా రూ.1 లక్ష చెక్కును మున్సిపల్ చైర్మన్ అలీంబాషా మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్‌డబ్ల్యుఎస్ కార్యాలయంలో కాంట్రాక్ట్ కార్మికుడుగా పనిచేస్తున్న కరుణాకర్ అనారోగ్యంతో గతంలో మృతిచెందాడని తెలి పారు. అతని కుటుంబానికి ఆర్థిక సహాయం మంజూరు కావడంతో మృతుడి భార్య సంధ్యకు నగదు అందజేశారు.

నేడు రొంపిచెర్ల మండల మీట్

రొంపిచెర్ల, జనవరి 9: రొంపిచెర్ల ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ చిచ్చిలి పురు షోత్తంరెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరుగు తుందని ఎంపీడీవో రాజేంద్ర తెలిపారు.





కుప్పంలో మద్దతు తెలుపుతున్న టీడీపీ నాయకులు, పలమనేరు, బైరెడ్డిపల్లెలో అంగన్వాడీల నిరసన

ఆగని అంగన్వాడీల నిరసనలు

- కుప్పంలో ఉరితాళ్లతో వినూత్న నిరసన
- పిల్లలతో దీక్షలకు అంగన్వాడీలు

కుప్పం, జనవరి 9: సమస్యలు పరిష్కరించాలని అంగన్వాడీలు దీక్షలు కొనసాగిస్తున్నారు. మంగళవారం కుప్పంలో ప్రభుత్వం అందించిన యూనిఫాం చీరలతో ఉరేసుకుని వినూత్న రీతిలో నిరసన తెలియజేశారు. జగన్‌రెడ్డి పాలనలో తమకు ఉరి వేసుకుని ప్రాణాలు తీసుకోవడమే మిగిలిందని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కారమయ్యే వరకు పోరాటం ఆపేది లేదని స్పష్టం చేశారు. కాగా అంగన్వాడీలు పిల్లాపాపలతో దీక్షలో పాల్గొంటున్నారు.

● **టీడీపీ మద్దతు:** అంగన్వాడీ దీక్షలకు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, కుప్పం నియోజకవర్గ విస్తరణ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు ఇతర నేతలతో కలసి మద్దతు ప్రకటించారు. దీక్షా శిబిరాన్ని సందర్శించి అంగన్వాడీలతో కలిసి నిరసనలో పాల్గొన్నారు. టీడీపీ నాయకులు డాక్టర్ వెంకటేశ్, కన్నన్, బాబు, రాజారామ్, జ్యోతీశ్వర్, సురేశ్, బాలాజీ, ఇమ్రాన్, రహంతుల్లా, మణి ఆయన వెంట ఉన్నారు.

పలమనేరు: పలమనేరు ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట 29 వరోజు కూడా అంగన్ వాడీ వర్కర్లు, హెల్పర్లు బైఠాయించి తమనిరసన కార్యక్రమాన్ని కొనసాగించారు. కనీసవేతనం రూ.26వేలు ఇవ్వాలని కోరారు. యూనియన్ నాయకులు అనసూయ, లత, ధనమ్మ, గాయత్రి, నీరజ, ఉష, లక్ష్మి, సరస్వతి, రాధ, ఆయాలు పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లె: బైరెడ్డిపల్లె ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట అంగన్వాడీ ఆందోళన కొనసాగింది. తమ సమస్యలపై ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి పరిష్కరించాలని కోరారు.

పుంగనూరు: అంగన్వాడీలకు ఇచ్చిన హామీలను అమలుచేయకుండా నిర్లక్ష్యం చూపుతున్న సీఎం జగన్‌కు భవిష్యత్తులో బుద్ధి చెప్పడం ఖాయమని అంగన్వాడీ కార్యకర్తలు హెచ్చరించారు. ఐసీడీఎస్ కార్యాలయం ముందు బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు రమణమ్మ, సునీత, సునంద, విజయకుమారి, అర్చన, లక్ష్మిదేవి, మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.




పుంగనూరులో నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు, కుప్పంలో పిల్లలతో దీక్షలో..

భూసేకరణలో రైతులకు న్యాయం చేస్తాం : ఇన్‌చార్జి కలెక్టర్



రైతులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీనివాసులు

పలమనేరు, జనవరి9 : చెన్నై - బెంగళూరు ఎక్స్‌ప్రెస్ హైవే రెండవ దశ పనులకు సంబంధించి భూ సేకరణలో భాగంగా నష్టపోయిన రైతులకు న్యాయం చేస్తామని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం పలమనేరు ఆర్డీవో కార్యాలయంలో భూమి కోల్పోతున్న రైతులతో, ఆర్డీవో, బైరెడ్డిపల్లి, వికోట, బంగారుపాళ్యం, పలమనేరు తహ సీల్దార్‌లతో అవార్డు పాస్‌చేసే అంశంపై ఆయన చర్చించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి కలెక్టర్ మాట్లాడుతూ ఎక్స్‌ప్రెస్ హైవే రెండవ దశ పనులు చేపట్టేందుకు అవార్డు పాస్‌చేసే విషయంలో ఎక్కడా రైతులకు అన్యాయం జరగదని స్పష్టం చేశారు. కోర్టు వివాదంలో ఉన్న భూములు, ఇప్పటివరకు నష్టపరిహారం జమకాని రైతుల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతామన్నారు. రోడ్డుకు భూమి పోగా మిగిలిన పొలాలకు దారి చూపాలని పలువురు రైతులు ఇన్‌చార్జి కలెక్టర్ దృష్టికి తీసుకురాగా తప్పకుండా దారి చూపుతామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో పలమనేరు మనోజ్‌కుమర్‌రెడ్డి, పలమనేరు, బైరెడ్డిపల్లి, బంగారుపాళ్యం, వి.కోట తహసిల్దార్‌లు కుప్పస్వామి, కుమార స్వామి, చిట్టిబాబు, అనిల్, అధికారులు పాల్గొన్నారు.

చంద్రన్న పాలనలోనే యువతకు ఉపాధి: టీడీపీ



మోదుగులపల్లెలో మహిళలతో మాట్లాడుతున్న చల్లా రామచంద్రారెడ్డి

పుంగనూరు రూరల్, జనవరి9: చంద్రన్న పాలనలోనే యువతకు ఉద్యోగ, ఉపాధి లభించిందని పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా మంగళవారం పుంగనూరు మండలం ఎంసీ పల్లె, పత్రపల్లి, తాండా, మోదుగులపల్లె, పూజగానిపల్లె తదితర గ్రామాల్లో ఆయన విస్తృతంగా పర్యటించారు. కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ యువతకు ఉపాధి కల్పిస్తామని నమ్మించి మోసం చేశారన్నారు. వైసీపీ ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలో ఉన్న పరిశ్రమలు ఇతర రాష్ట్రాలకు తరలిపోతున్నాయని విమర్శించారు. దీంతో యువతకు ఉపాధిలేక ఇతర రాష్ట్రాలకు వలస పోతున్నారని చెప్పారు. టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాధవరెడ్డి, సీవీ రెడ్డి, శ్రీకాంత్, ఆసూరి బాలాజీ, సుహేల్‌బాషా, ముల్లంగి రమణ, రామయ్య, గంగాధర్, ప్రసాద్‌స్వామి, గాజుల రమణ, ఆర్పీ శ్రీరాములు, మనోజ్, మసెన్న, నరసింహులు, మధు, బాలాజీ, వెంకటరమణ, పూజగానిపల్లె వెంకటరమణ, ఆంజి, జనసేన నాయకులు పగడాల రమణ, చిన్నారాయల్, విరూపాక్షి, పాముల హరి, చైతన్య, నరేశ్‌రాయల్, బాలాజీ నాయక్, హరినాయక్ తదితరులు పాల్గొన్నారు.

యువత క్రీడలపై దృష్టి సారించాలి



పులిచెర్లలో ర్యాలీని ప్రారంభిస్తున్న ఎంపీడీవో రాజశేఖర్‌బాబు

కల్లూరు, జనవరి 9: యువత క్రీడలపై దృష్టిసారించాలని ఎంపీడీవో రాజశేఖర్ బాబు తెలిపారు. పులిచెర్లలో మంగళవారం ఆడుదాం ఆంధ్ర క్రీడలపై పురవీధుల్లో ర్యాలీ నిర్వహించి బస్టాండు కూడలిలో మానవహారం చేపట్టారు. ఈ క్రీడలను ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు సిద్ధరామయ్య, పోకల తాతయ్య, ఏపీవో షౌకత్, ఏపీఎం చంద్రమోహన్, సర్పంచ్ రాణెమ్మ, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

రొంపిచెర్ల: మండల స్థాయిలో రెండు రోజులు జరిగే ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంపై చైతన్య పరచడానికి మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ నెల 10, 11వ తేదీల్లో మండల కేంద్రంలోని బాలుర జడ్పీ ఉన్నత పాఠశాలలో వాలీ బాల్, కోకో, క్రికెట్, బాల్‌బ్యాడ్మింటన్, వంటి ఆటల పోటీలు నిర్వహిస్తామని ఎంఈవో శ్రీనివాసులు తెలియజేశారు.

బైరెడ్డిపల్లె: బైరెడ్డిపల్లె మండలంలో బుధవారం నుంచి ప్రారంభం కానున్న ఆడుదాం ఆంధ్ర మండలస్థాయి క్రీడలను విజయవంతం చేయాలని ఎంపీపీ రెడ్డెప్ప కోరారు. దీనికి సంబంధించి మంగళవారం బైరెడ్డిపల్లెలో ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బందితో కలసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక నాలుగురోడ్ల కూడలి వద్ద మానవహారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డెప్ప, మండల ప్రత్యేకాధికారి అన్నపూర్ణాదేవి, ఎంపీడీవో రాజేంద్రబాలాజీ, ఎంఈవో సుబ్రమణ్యం, గ్రామకార్యదర్శి సదాశివయ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నిరాశ్రయులకు అన్నదానం

చిత్తూరు కల్చరల్, జనవరి 9: సత్యసాయి సేవాసమతి ఆధ్వర్యంలో మాస నారాయణీ సేవల్లో భాగంగా మంగళవారం నగరంలోని వివిధ ప్రాంతాల్లో నిరాశ్రయులకు అన్నదానం చేశారు. చిత్తూరు ప్రభుత్వాస్పత్రి, గాంధీ సెంటర్, పాతబస్టాండు, ఎంఎస్ఆర్ జంక్షన్, లెప్రసీ కాలనీ తదితర ప్రాంతాల్లో నిరాశ్రయులకు భోజన పొట్లాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి సేవాసమితి నగర కన్వీనర్ ఆర్ శేషనారాయణ, బి. పాండురంగం, గజేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీకాలతో పాడి పశువులకు రక్షణ



పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు శ్రీనివాసులు నాయుడు

రొంపిచెర్ల, జనవరి 9: పాడి పశువుల్లో వ్యాధుల నివారణకు టీకాలు వేయించాలని పశు సంవర్ధక సహాయ సంచాలకులు శ్రీనివాసులు నాయుడు పేర్కొన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రొంపిచెర్ల, సదుం, పులిచెర్ల, సోమల మండలాల్లో రైతులకు వ్యవసాయ రంగం తర్వాత అతి ముఖ్యమైనది పాడి పరిశ్రమ అని తెలిపారు. పశువులలో ప్రధానంగా సూక్ష్మజీవల వల్ల గొంతువాపు వ్యాధి వస్తుందన్నారు. దీనికి టీకాలు వేసుకోవాలన్నారు. గాలికుంటు వ్యాధి సోకిన ఆవులు, గేదెల పాల ద్వారా దూడలకు వ్యాప్తి చెందుతుందన్నారు. నోరు, గిట్టల మధ్య బొబ్బలు ఏర్పడి 34 వారాల్లో బొబ్బలు చితికి పుండ్లుగా మారతాయి, ఆ పుండ్లకు పొటాషియం పర్మాంగనేట ద్రావణంతో కడిగి ఈగలు వాలకుండా వేపనూనె పూయాలని సూచించారు. ఏ సమస్య ఉన్నా పశువైద్యులను సంప్రదించాలని తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంతోనే ఆరోగ్యం



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ శివకుమార్

సోమల, జనవరి 9: రసాయనిక సేద్యం వీడి ప్రకృతి వ్యవసాయ దిగుబడులు ఆహారంగా తీసుకుంటే మంచి ఆరోగ్యంతో జీవించవచ్చని పుంగనూరు ఏడీఏ శివకుమార్ అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ప్రకృతి వ్యవ సాయ ఆరోగ్య పథకం ప్రాజెక్టు మేనేజర్ వాసు మాట్లాడుతూ రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులు వేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపీపీ ఈశ్వరయ్య, వైస్ఎంపీపీ ప్రభాకర్, ఎంఏవో సుధాకర్, ఏఎంసీ మాజీ చైర్మన్లు మోహన్, నాగేశ్వరరావు, ప్రకృతి వ్యవసాయ అధికారులు శ్రీనివాసులు, రెడ్డిరాణి, రమేశ్ పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు



సోమల, జనవరి 9: ప్రభుత్వ వైద్యశాలల్లో ప్రతి నెలా 9వ తేదీ జరిగే వైద్యపరీక్షలను గర్భిణులు సద్వినియోగం చేసు కోవాలని పెద్దఉప్పరపల్లె వైద్యాధికారి డాక్టర్ బాలాజీ అన్నారు. మంగళవారం స్థానిక వైద్యశాలలో పలువురు గర్భిణులకు వైద్యపరీక్షలు జరిపారు. మందుల వినియోగం, ఆహార పద్ధతులను వివరించారు. ఎంపీహెచ్ఈవో ఆంజనేయులు, చంద్రమ్మ, స్వర్ణ, హేమలత తదితరులు పాల్గొన్నారు.

సారా తయారీ కేంద్రాలపై దాడులు



సోమల, జనవరి 9: సోమల మండలం తమ్మినాయనపల్లె పంచాయతీ పేగల వారిపల్లె సమీపంలోని వంక వద్ద సారా తయారీ కేంద్రాలపై పోలీసులు మంగళవారం దాడులు చేశారు. ఎస్ఐ వెంకట నరసింహులు ఆధ్వర్యంలో 1200 లీటర్లు సారా ఊటను, సారా తయారీ సామగ్రిని ధ్వంసం చేశారు. 15 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు.

సోమలలో ఆడుదాం ఆంధ్రా ర్యాలీ



సోమల, జనవరి 9: ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా మంగళవారం సోమల ఎంపీడీవో కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు జూనియర్ కళాశాల విద్యార్థులు అధికారులు, ప్రజాప్రతినిధులు ర్యాలీ జరిపారు. బస్టాండ్‌లో మానవహారం నిర్వహించారు. మండల ప్రత్యేక అధికారి శివకుమార్, ఎంపీడీవో నాగరాజ, ప్రిన్సిపాల్ గంగాధరం నాయుడు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి గౌతం, ఎంపీపీ ఈశ్వరయ్య, వైస్ ఎంపీపీ ప్రభాకర్, ఎంఈవో శివరత్న, కార్యదర్శులు పాల్గొన్నారు.

బంగారు భవిష్యత్తు కోసం టీడీపీని గెలిపించండి: అమర్

బైరెడ్డిపల్లె, జనవరి 9 : రాష్ట్ర బంగారు భవిష్యత్తు కోసం రాబోయే ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని మాజీ మంత్రి అమరనాథరెడ్డి కోరారు. ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆయన మండలంలోని నెల్లిపట్ల పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా అమరనాథరెడ్డి మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం పూర్తిచేయకుండా అసంపూర్తిగా వది లేసిందని విమర్శించారు. గ్రామీణ రహదారులు అస్తవ్యస్తంగా ఉన్నా పట్టిం చుకునే దిక్కులేకుండా పోయిందన్నారు. ఈ ప్రాంతంలో మల్బరీ రైతులకు ప్రభుత్వం ద్వారా ఎలాంటి సహాయం అందకపోవడంతో ఇబ్బందులు పడుతు న్నారన్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వంలో తాను నెల్లిపట్ల పంచాయతీలో చెత్తను తరలించడానికి ఓ ట్రాక్టర్‌ను మంజూరుచేస్తే ఇప్పుడు ఆ ట్రాక్టర్ ఏమైందో తెలియడం లేదన్నారు. టీడీపీ, జనసేనకు లభిస్తున్న ప్రజాదరణ చూసి వైసీపీలో వణుకు మొదలైందన్నారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీ, జనసేన అఖండ మెజారిటీతో అధికారం చేపట్టడం ఖాయమని ధీమా వ్యక్తంచేశారు. చంద్రబాబును మరోసారి ముఖ్యమంత్రిగా చేయడానికి ప్రజలంతా సహకరించి సైకిల్ గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. కాగా నెల్లిపట్లలో పర్యటించిన అమరనాథరెడ్డికి టీడీపీ, జనసేన నాయకులు ఘనస్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు కిశోర్‌గౌడు, ప్రధాన కార్యదర్శి సుబ్రమణ్యంశెట్టి, పలువురు టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.



నెల్లిపట్లలో అమరనాథరెడ్డికి స్వాగతం పలుకుతున్న టీడీపీనాయకులు

రాబోయే ఎన్నికల్లో అధికారం మనదే: భానుప్రకాష్



గాలి భానుప్రకాశ్‌తో టీడీపీ నేతలు, కార్యకర్తలు

విజయపురం, జనవరి 9: రాబోయే ఎన్నికల్లో అధికారం మనదేనని నగరి టీడీపీ ఇన్‌చార్జి గాలి భానుప్రకాశ్ కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. మంగళవారం మండలంలోని జంబాడ, కోసలనగరం పంచాయతీ టీడీపీ కార్యకర్తలతో నగరి పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించి బూత్‌ల వారీగా ఓటర్ల జాబితా విషయమై సమీక్షించారు. కార్యక్రమంలో మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి బాబుయాదవ్, నాయకులు సుధాకర్‌రాజు, బాషా, ధాము, సుబ్రహ్మణ్యంరాజు, ఓబుల్‌రాజు, రవిరాజు, కేసీ సుబ్రహ్మణ్యంరాజు, సుబ్బయ్యదాస్, బాలసుబ్రహ్మణ్యంరాజు, లోకేశ్ తదితరులు పాల్గొన్నారు.

వరసిద్ధుడి సేవలో హైదరాబాద్ పోలీస్ కమిషనర్



శ్రీనివాసులు రెడ్డికి జ్ఞాపికను అందిస్తున్న ఏఈవోలు

ఐరాల(కాణిపాకం), జనవరి 9: హైదరాబాద్ పోలీస్ కమిషనర్ కె.శ్రీనివాసులురెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహా మండలి సలహాదారుడు ఐ. తిరుపాల్‌రెడ్డి మంగళవారం కాణిపాక వరసిద్ధుడిని వేర్వేరుగా దర్శించుకున్నారు. వారిని ఏఈవోలు విద్యాసాగర్‌రెడ్డి, ఎస్వీ.కృష్ణారెడ్డి ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందచేశారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు, ఆలయ ఇన్‌స్పెక్టర్లు రమేష్, విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 'విజయం సీబీఎస్ఈ' వార్షికోత్సవం



మాట్లాడుతున్న విజయం విద్యా సంస్థల డైరెక్టర్ శైలజామూర్తి

చిత్తూరు (సెంట్రల్), జనవరి 9: స్థానిక సుందరరాజుపురంలోని విజయం సీబీఎస్ఈ పాఠశాల నాల్గవ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం ఓ ఫంక్షన్ హాలులో ఆ విద్యాసంస్థల అధినేత తేజోమూర్తి, డైరెక్టర్ శైలజామూర్తి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న జీడీనెల్లూరు ఎంఈవో గుణశేఖర్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ఇంట్లో తల్లిదండ్రులు, స్కూల్లో ఉపాధ్యాయుల మాటలు, సూచనలు ఆచరిస్తూ భవిష్యత్తులో రాణించాలని ఆకాంక్షించారు. విద్యాసంస్థల అధినేత తేజోమూర్తి మాట్లాడుతూ చదువుతో పాటు అన్ని విభాగాల్లో విద్యార్థులు రాణించాలనే ఆశయంతో యాజమాన్యం పనిచేస్తుందన్నారు. విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ శైలజా మూర్తి పాఠశాల వార్షిక నివేదికను వివరించారు. క్రీడలు, అకడమిక్‌లో ఉత్తమ ప్రతిభ కనపరచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థులు, తల్లిదండ్రులను అలరించాయి. కార్యక్రమంలో ఐసీఐసీఐ బ్యాంకు మేనేజర్ జనార్ధన్, సీబీఎస్ఈ హెచ్ఎం కౌసల్య, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

చిట్టిబాబుకు సన్మానం



చిట్టిబాబును గజమాలతో సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

పాలసముద్రం, జనవరి 9: పాలసముద్రం మండలానికి చెందిన భీమనేని చిట్టిబాబు నాయుడును టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా నియమించడంతో మంగళవారం పాలసముద్రంలో గంగాధరనెల్లూరు నియోజకవర్గంలోని గంగాధరనెల్లూరు, కార్వేటినగరం, పెనుమూరు మండలాలతో పాటు, మండలానికి చెందిన పలువురు నేతలు శాలువలు కప్పి, గజమాలలు వేసి సన్మానించారు. ఈ సందర్భంగా పాలసముద్రం బీసీ కాలనీ నుంచి టీడీపీ కార్యాలయం వరకు బాణసంచా పేలుస్తూ చిట్టిబాబు నాయుడుకు ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కృష్ణమూర్తి నాయుడు, దేవరాజు, సందాని, దాము, వెంకటేశులు నాయుడు, మాజీ ఎంపీపీ మోహన్, దాము రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గణితంలో మెలకువలతో ఉత్తమ మార్కులు

చిత్తూరు (సెంట్రల్), జనవరి 9: గణితంలో మెలకువలు తెలుసుకుంటే సులభతరంగా పాస్ కావడమే కాకుండా ఉత్తమ మార్కులు సాధించవచ్చునని ఏపీ రాష్ట్ర గణిత ఫోరం ప్రధాన కార్యదర్శి భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక విజయం కళాశాలలో ఏపీ గణిత ఫోరం జిల్లా కార్యవర్గ సమావేశం ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అరుణ్ శివప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ఆంధ్రవిశ్వవిద్యాలయ విశ్రాంత ఆచార్యులు రాధాకృష్ణారెడ్డి అనువర్తిక గణితంపై అవగాహన కల్పించారు. విజయం విద్యాసంస్థల అధినేత తేజోమూర్తి భావితరాల భవిష్యత్తు గణిత అధ్యాపకులపై ఆధారపడి ఉంటుందన్నారు. అనంతరం జిల్లా గణిత ఫోరం ఎన్నికలను పరిశీలకుడు నామా చంద్రశేఖర్ అధ్యక్షతన నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా చంద్రమ నాయుడు, ప్రధాన కార్యదర్శిగా వేణుగోపాల్‌రెడ్డి, కోశాధికారిగా మనోహర్, జిల్లా మహిళ అధ్యక్షురాలిగా జయంతిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు, జడ్ఎస్ఎస్ కోఆర్డినేటర్ త్యాగరాజు, తేజ, తదితరులు పాల్గొన్నారు.

పాపిరెడ్డిపల్లెలో వ్యవసాయ ప్రదర్శన



సదస్సులో స్టాల్స్‌ను పరిశీలిస్తున్న అధికారులు

గంగాధరనెల్లూరు, జనవరి 9: తిరుపతి ఎస్వీ వ్యవసాయ కళాశాలకు చెందిన విద్యార్థులు గంగాధరనెల్లూరు మండలంలోని పాపిరెడ్డిపల్లెలో వ్యవసాయప్రదర్శనతో పాటు ఏరువాక కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన స్టాల్స్‌ను అధికారులు పరిశీలించి, వాటిపై విద్యార్థులకు ప్రశ్నలు వేసి వారి నుంచి సమాధానాలు రాబట్టారు. ఈ కార్యక్రమంలో ఎస్వీ వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనస్థానం ఏడీఆర్ డాక్టర్ రమణ, జిల్లా ఉద్యానవన అధికారి మధుసూదన్‌రెడ్డి, ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ రెడ్డి, నగరి ఏడీఏ సౌభాగ్యలక్ష్మి, ఎస్వీ కళాశాల ఏడీ డాక్టర్ జ్యోత్స్న, శాస్త్రవేత్తలు రాఘవేంద్ర, నాగమణి, ఏవో వందన, సర్పంచ్ పార్థసారథిరెడ్డి, ఎంపీటీసీ భారతి, వీఏఏ చక్రవర్తి, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

హనుమాన్ ప్రచార రథం ఊరేగింపు

నింద్ర, జనవరి 9: మండల కేంద్రమైన నింద్రలో మంగళవారం తిరుమల తిరుపతి హనుమాన్ రథం ఊరేగించారు. గ్రామంలోని భక్తులు స్వామివారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. తిరుపతిలో ఈ నెల 13వ తేదీ నుంచి 20 తేదీ వరకు విశేష కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ బాబురెడ్డి, తిరుపతి ధర్మ ప్రచార సభ్యులు పాల్గొన్నారు.

సంతకాల సేకరణ

గంగాధరనెల్లూరు, జనవరి 9: విజయవాడలో వంద అడుగుల ఎత్తుతో కొత్తగా ఏర్పాటుచేయనున్న డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ విగ్రహం గురించి ప్రజల నుంచి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ఇన్‌చార్జి ఎంపీడీవో సుధాకర్, మండల వైస్ ఎంపీపీ హరిబాబు మంగళవారం లాంఛనంగా ప్రారంభించారు. ఎంపీడీవో కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి అధికారులు, నేతలు పూజలు చేసి నివాళులు అర్పించారు. మండల ఉపాధి ఏపీవో శ్రీనివాసులు, ఐకేపీ ఏపీఎం చిరంజీవి, నేతలు జగన్, వినోద్, మహిళలు పాల్గొన్నారు.

సస్య రక్షణతో అధిక దిగుబడి

తవణంపల్లె, జనవరి 9: మామిడి పూత, పిందె దశలో సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడులు సాధించవచ్చునని జిల్లా ఉద్యానవనాధికారి మధుసూదన్‌రెడ్డి సూచించారు. మంగళవారం మండలంలోని అరగొండ గౌరి శంకర కల్యాణ మండపంలో మామిడి పూత, పిందె దశలో చేపట్టవలసిన సస్యరక్షణ చర్యలపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తెగుళ్ల నివారణకు కొమ్మల కత్తిరింపు, సస్యరక్షణలో సరైన యాజమాన్య పద్ధతులను పాటించాలని సూచించారు. శాస్త్రవేత్త రాఘవేంద్ర, ఉద్యానాధికారి సాగరిక, రైతులు పాల్గొన్నారు.

వాకర్స్ అసోసియేషన్ ఏర్పాటు

కార్వేటినరగం, జనవరి 9: కార్వేటినగరంలో వాకర్స్ అసోసియేషన్ సంఘం నూతన అధ్యక్షుడిగా నడింపల్లి యువరాజును నియమించినట్లు నేషనల్ వాకర్స్ సంఘం అధ్యక్షుడు మురళీమోహన్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి కోనేటి రవిరాజు, ప్రదీప్, రోహిత్ పాల్గొన్నారు.

పన్నూరులో సామాజిక తనిఖీ

విజయపురం, జనవరి 9: మండలంలోని పన్నూరులో ఉపాధి హామీ పథకంలో జరిగిన పనులపై మంగళవారం సామాజిక తనిఖీ నిర్వహించారు. ఉపాధి పనులను 16వ రౌండ్ నిర్వహిస్తున్నారని, పనుల్లో నాణ్యతను పెంచి, ప్రజలకు చేరువ కావాలని సామాజిక తనిఖీ నిర్వహిస్తున్నట్లు ఏపీవో బబిత తెలిపారు. ఉపాధి పనుల తనిఖీని ఏపీవో పర్యవేక్షించారు. మండలంలో అన్ని పంచాయతీలో విడతల వారీగా తనిఖీ జరుగుతుందన్నారు.



నగరి మండలం సత్రవాడలోని వైఎస్సార్ అర్బన్‌హెల్త్ సెంటర్‌ను మంగళవారం పరిశీలిస్తున్న ఢిల్లీ నుంచి విచ్చేసిన కేంద్ర వైద్య సేవల క్వాలిటీ అభివృద్ధి పరిశీలన సభ్యులు డాక్టర్ దీపక్ డోంగ్రే, డాక్టర్ నిఘాధావన్

ఎస్మా నోటీసులకు భయపడేదే లేదు



నిరవధిక నిరాహార దీక్షలో మాట్లాడుతున్న షకీలా

చిత్తూరు, జనవరి 9: న్యాయమైన కోర్కెల పరిష్కారం కోసం అంగన్వాడీలు చేస్తున్న సమ్మెను విచ్ఛిన్నం చేయానికి ప్రభుత్వం జారీ చేసిన నోటీసులకు భయపడేదే లేదని అంగన్వాడీ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు వాడ గంగరాజు అన్నారు. అంగన్వాడీ వర్కర్లు చేస్తున్న సమ్మె 29వ రోజుకు చేరుకోగా కలెక్టరేట్ వద్ద జరుగుతున్న నిరవధిక నిరాహారదీక్ష మంగళవారంతో నాలుగవ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్మా చట్టాన్ని అడ్డుపెట్టుకుని జిల్లా అధికారులు నోటీసులు జారీ చేయడం దుర్మార్గమన్నారు. ఇలాంటి బెదిరింపులను అంగన్వాడీ యూనియన్ చాలా చూసిందని, ఎస్మాలాంటి ఎన్ని చట్టాలు వచ్చిన భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఏపీ అంగన్వాడీ యూనియన్ నాయకురాలు షకీలా, సీఐటీయూ జిల్లా కార్యదర్శి సురేంద్రన్, ఎస్టీయూ నేత గంటా మోహన్‌లు మాట్లాడుతూ అంగన్వాడీలు, ఎస్ఎస్ఏ ఉద్యోగులు, మున్సిపల్ సిబ్బంది సమ్మెలో ఉన్నారని, ప్రభుత్వం స్పందించి సమస్యలను పరిష్కరించకపోతే వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికిపంపే రోజులు దగ్గరపడతాయని హెచ్చరించారు. ప్రభుత్వం స్పందించి అంగన్వాడీ వర్కర్ల సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. సంఘ నేతలు ప్రభావతి, ఓబుల్‌రాజు, ధనకోటి, ఎర్రమ్మ, లీలావతి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకపోతే

జైలుకెళ్లడానికైనా సిద్ధమే

కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జైల్‌భరో కార్యక్రమం

చిత్తూరు రూరల్, జనవరి 9: అంగన్వాడీ, మున్సిపల్, కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే జైలుకు వెళ్లడానికైనా సిద్ధంగా ఉన్నామని ఏఐటీయూసీ గౌరవాధ్యక్షుడు నాగరాజు తెలిపారు. మంగళవారం సమ్మెకు సంఘీభావంగా ఏఐటీయూసీ, సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో నగరంలో జ్యోతీరావుపూలే విగ్రహం వద్ద జైల్‌భరో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీలు, మున్సిపల్ పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికులు నిరవధిక సమ్మె చేస్తున్నప్పటికీ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం నిద్రపోయినట్టు నటిస్తూ కార్మిక వర్గాన్ని మోసం చేస్తుందని తీవ్రంగా విమర్శించారు. నిరసన తెలుపుతున్న నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు గంగరాజు, సురేంద్రనాథ్, ఈశ్వర్, విజయగౌరి, జమిలాబీ, కోమల తదితరులు పాల్గొన్నారు.

నిరాశ్రయులకు అన్నదానం

చిత్తూరు కల్చరల్, జనవరి 9: సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో చిత్తూరు ప్రభుత్వాస్పత్రి, గాంధీ సెంటర్, పాతబస్టాండు, ఎంఎస్ఆర్ జంక్షన్ తదితర ప్రాంతాల్లో నిరాశ్రయులకు భోజన పొట్లాలు పంపిణీ చేశారు. ఆర్ శేషనారాయణ, బి. పాండురంగం, గజేంద్రరెడ్డి పాల్గొన్నారు.

చెత్త బతుకు మారదా... జగనన్నా...?

● వర్మీకంపోస్టు యార్డులో చిన్నారులతో కలసి జీవనం సాగిస్తున్న తల్లి



వర్మీకంపోస్టు యార్డులో నివసిస్తున్న తల్లీపిల్లల బాధలు వింటున్న మురళీమోహన్

బంగారుపాళ్యం, జనవరి 9: వర్మీకంపోస్టు యార్డులో గత కొన్నేళ్లుగా చెత్త కుప్పలో నివాసం ఉంటున్న ఓ కుటుంబ దీనగాథ. మండలంలోని నల్లంగాడు సచివాలయానికి కూతవేటు దూరంలో ప్రభుత్వం నిర్మించిన వర్మీకంపోస్టు యార్డులో గ్రామానికి చెందిన రవీంద్ర, రోజా కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఈ దీనగాథ మంగళవారం వెలుగులోకి వచ్చింది. బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గ ఇన్‌చార్జి మురళీమోహన్ ఆ కుటుంబాన్ని పలకరించారు. ఆ కుటుంబ బాధను చూసి చలించిపోయారు. ఈ సందర్భంగా రోజా తమ సమస్యలను మురళికి వివరించారు. తన కుటుంబం గత నాలుగేళ్ల క్రితం అప్పు చేసి ఇల్లు నిర్మించుకునేందుకు పునాదులు వేస్తే రెవిన్యూవారు వచ్చి ఆ స్థలం గ్రామనత్తం.. ఇల్లు కట్టుకోవడానికి వీలు లేదంటూ అర్ధాంతరంగా ఆపేశారని తెలిపింది. దీంతో రోజా జగనన్నకు చెబుదాం టోల్‌ఫ్రీ నెంబరుకు పలుమార్లు ఫోన్‌చేసి తన గోడు వెల్లబోసుకోగా... సచివాలయానికి వెళ్లి అడగాలని సూచించారు. దీంతో పలుమార్లు సచివాలయం చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా తన గోడును ఎవ్వరూ పట్టించుకోలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. ఇక చేసేదేమి లేక ప్రభుత్వం నిర్మించిన కంపోస్టు యార్డులో నాలుగేళ్లుగా ఉంటూ కూలిపనులకెళ్తూ, రెండు మేకలను మేపుకుంటూ, తన చిన్నారులను ప్రభుత్వ బడిలో చదివిస్తూ జీవనం సాగిస్తున్నారు. చెత్త, వ్యర్థాల నుంచి ఎరువులను తయారుచేసే గదుల్లోనే తన పిల్లల ఆలనాపాలనా చూస్తోంది. ఈ సందర్భంగా ఇన్‌చార్జి మురళీమోహన్ మాట్లాడుతూ... ఓ జగన్‌మోహన్ రెడ్డి గారూ.... వీరి దీనగాథ మీ చెవులకు వినబడలేదా...? మీ సచివాలయ సిబ్బందికి కనబడలేదా...? ఇంటింటికీ తిరిగి సమాచారం సేకరించే వలంటీర్లకూ ఈ సమాచారం అందించాలని తెలియదా..? ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆ కుటుంబానికి రెండు సెంట్ల భూమి, పట్టా, ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు ఎన్‌పీ జయప్రకాష్, రాజమాణిక్యం, అనిల్, రమేష్, గిరి, జనార్దన్ గౌడ్, హరిప్రసాద్, సుదర్శన్ నాయుడు, హేమచంద్ర నాయుడు, శివ, వంశీ, మంజునాథ్, గురుస్వామి తదితరులు ఉన్నారు.

త్యాగధనుల కుటుంబంపై ఆరోపణలు మానుకోవాలి

- డీసీసీ అధ్యక్షుడు భాస్కర్

గంగాధరనెల్లూరు/వెదురుకుప్పం, జనవరి 9: దేశం కోసం ప్రాణ త్యాగాలు చేసిన కుటుంబంపై డిప్యూటీ సీఎం నారాయణస్వామి తప్పుడు ఆరోపణలు చేయడం మానుకోవాలని డీసీసీ అధ్యక్షుడు పోటుగారి భాస్కర్ మంగళవారం ఒక ప్రకటనలో హితవు పలికారు. యాదృచ్ఛికంగా జరిగిన వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మరణాన్ని పావుగా వాడుకుని రాజకీయ లబ్ధి కోసం రిలయన్స్ సంస్థను, కాంగ్రెస్ పార్టీని ముద్దాయిగా చేసి నేడు అదే రిలయన్స్ సంస్థ భాగస్వామిని రాజ్యసభకు పంపింది మీరు కాదా? అని సీఎం జగన్‌ను ప్రశ్నించారు. వైఎస్సార్ మరణంలో కాంగ్రెస్ పార్టీకి, సోనియాగాంధీకి ఎటువంటి సంబంధంలేదని నమ్మే ఆయన కుమార్తె షర్మిల కాంగ్రెస్‌లో చేరారని, ఆమె సైతం మీడియా మూలంగా ప్రకటించారని ఆయన పేర్కొన్నారు. సోనియాగాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన నారాయణస్వామిపై హైదరాబాద్‌లో కాంగ్రెస్ సీనియర్ నేత మల్లు రవి ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు.

తత్వశాస్త్రంలో డాక్టరేట్ పట్టా పొందిన నయీముల్లా



నయీముల్లాను అభినందిస్తున్న ముస్లిం మతపెద్దలు

చిత్తూరు కల్చరల్, జనవరి 9: చిత్తూరు డివిజన్ ప్రభుత్వ ఖాజీ నయీముల్లా మద్రాస్ విశ్వ విద్యాలయం నుంచి డాక్టరేట్ పట్టా పొందారు. నయీముల్లా తత్వశాస్త్రంలో పరిశోధనలు చేసినందుకు ఆయనకు డాక్టరేట్ పట్టాను హైదరాబాద్ మౌలానా అజాద్ విశ్వవిద్యాలయం డీన్ నసీముద్దీన్ అందజేశారు. డాక్టరేట్ పట్టా పొందిన నయీముల్లాను మంగళవారం చిత్తూరు గంగనపల్లె మసీదులో జిల్లా ప్రభుత్వ ఖాజీ కమాలుల్లా జుహారి, ఉర్దూ టీచర్స్ సంఘం నాయకులు మునీర్ అహమ్మద్, ఘని, రషీద్, గఫార్ సాహెబ్, ముక్తార్, అన్సర్, సర్దార్‌లు అభినందించారు.

భక్తిశ్రద్ధలతో ప్రదోష కాల పూజలు

వెదురుకుప్పం, జనవరి 9: వెదురుకుప్పం మండలం దీఆర్ఎన్‌కండ్రిగ సమీపంలో కొలువై ఉన్న జ్ఞాన ప్రసూనాంబ కొండ మల్లీశ్వరస్వామి ఆలయంలో మంగళవారం ప్రదోష కాలం పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కొండ మల్లీశ్వరస్వామికి, నందీశ్వరుడికి ఏక కాలంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, పుష్పాలంకరణ, హారతి ఇచ్చారు. తర్వాత తీర్థ ప్రసాదాలు అందించారు. శివ, అన్నమయ్య సంకీర్తనలు ఆలపించారు. భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

16 మంది బైండోవర్

గుడిపాల, జనవరి 9: మండలంలోని వివిధ కేసుల్లో నమోదైన 16 మందిని మంగళవారం ముందస్తుగా బైండోవర్ చేసినట్లు గుడిపాల ఎస్ఐ రామ్మోహన్ తెలిపారు. ముందస్తు ఎన్నికల సందర్భంగా గ్రామాల్లో కొంతమందిపై కేసులున్న వారిని బైండోవర్ చేస్తామని ఆయన తెలిపారు.

కాలువ గట్టు కబ్జా



ఆక్రమణకు గురైన స్థలం

బంగారుపాళ్యం, జనవరి 9: మండలంలోని జంబువారిపల్లె రెవెన్యూ వెంకటప్పనాయని చెరువుకు ఏర్పాటు చేసిన సాగునీటి కాలువ గట్టు స్థలాన్ని ఓ వ్యక్తి ఆక్రమించుకుని దుకాణాన్ని నిర్మించాడు. స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డుకు సమీపంలో ఈ కాలువ స్థలం ఉంది. ఈ కాలువ పక్కలోనే జాతీయ రహదారి వెళుతోంది. లక్షలాది రూపాయల విలువ కలిగిన ఈ స్థలాన్ని ఆ వ్యక్తి ఆక్రమించుకున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదు. కాలువకు ఇరువైపులా ఉన్న స్థలాన్ని ఆక్రమించుకుని ఇల్లు కట్టుకున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి ఈ ఆక్రమణలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

పులివర్తి నానిని పరామర్శించిన టీడీపీనేతలు



పరామర్శిస్తున్న దొరబాబు, జగన్‌మోహన్

చిత్తూరు సిటీ, జనవరి 9: టీడీపీ చిత్తూరు పార్లమెంటు అధ్యక్షుడు, చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నానిని మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, పార్టీ సీనియర్ నేత, జీజేఎం చారిటబుల్ ఫౌండేషన్ చైర్మన్ గురజాల జగన్‌మోహన్ పరామర్శించారు. తిరుపతి స్విమ్స్‌లో చికిత్స పొందుతున్న నానిని మంగళవారం పరామర్శించి, ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. దొంగఓట్లను తొలగించాలని సోమవారం ఆమరణ దీక్ష చేస్తున్న పులివర్తి నాని దీక్షా శిబిరం వద్ద పోలీసుల తోపులాట, ఆయన కళ్లలో పెట్రోల్ పడటంతో తీవ్ర అస్వస్థతకు గురై స్విమ్స్‌లో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. కాగా జిల్లా వ్యాప్తంగా ఉన్న పార్టీ నేతలు, కార్యకర్తలు నానిని పరామర్శించేందుకు స్విమ్స్‌కు వెళుతున్నారు.

అభివృద్ధి జరగాలంటే చంద్రబాబు రావాలి



కరపత్రాలు పంపిణీ చేస్తున్న కార్జాల అరుణ

పెనుమూరు, జనవరి 9: రాష్ట్రం అభివృద్ధి పథంలో నడవాలన్నా ప్రజలు సంక్షేమంతో జీవించాలన్నా చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని జిల్లా మహిళా అధ్యక్షురాలు కార్జాల అరుణ, మండల టీడీపీ అధ్యక్షులు రుద్రయ్య నాయుడు అన్నారు. మంగళవారం వారు మండలంలోని తాటిమాకులపల్లి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి భవిష్యత్తుకు గ్యారెంటీ పత్రాలను పంపిణీ చేశారు. అశోక్, శ్రీకృష్ణ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ముందస్తు సంక్రాంతి సంబరాలు



భోగి మంటలు వేస్తున్న గణపతి నాయుడు తదితరులు

తవణంపల్లె, జనవరి 9: మండలంలోని కాణిపాకంక్రాస్ వద్ద గల వినాయక విద్యామందిరం పాఠశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలను మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు సాంప్రదాయ దుస్తులు ధరించి భోగి మంటలు వేసి పూజలు నిర్వహించారు. పాఠశాల కరస్పాండెట్ గణపతి నాయుడు విద్యార్థులకు తెలుగు సాంప్రదాయాలు, సంక్రాంతి పండుగ విశిష్టత గురించి వివరించారు. అనంతరం విద్యార్థులకు సాంస్కృతిక పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి చెన్నకేశవులు, పద్మనాభం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చంద్రబాబు వస్తేనే రాష్ట్రానికి భవిష్యత్తు

శ్రీరంగరాజపురం, జనవరి 9: చంద్రబాబు నాయుడు అధికారంలోకి వస్తేనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి భవిష్యత్తు ఉంటుందని టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు అన్నారు. మంగళవారం మండలంలోని పాతపాళ్యం, ఎస్ఆర్‌పురం గ్రామాల్లో జయశంకర్ నాయుడు ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో గంగాధరనెల్లూరు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి డాక్టర్ థామస్‌ను అఖండ మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు. రాజశేఖర్ నాయుడు, నిరంజన్‌రెడ్డి, హేమాద్రి యాదవ్, శ్రీహరిరెడ్డి, మాధవ నాయుడు పాల్గొన్నారు.

జన్ భగీదారి కార్యక్రమాల్లో భాగస్వాములు కండి



డీవీఎంసీ సభ్యులతో మాట్లాడుతున్న కమిషనర్

చిత్తూరు, జనవరి 9: భారతరత్న బీఆర్ అంబేడ్కర్ కాంస్య విగ్రహ ఆవిష్కరణను పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న జన్ భగీదారి కార్యక్రమాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ సంఘాల నాయకులు, ప్రజలు భాగస్వాములు కావాలని నగర కమిషనర్ అరుణ పిలుపునిచ్చారు. జన్ భగీదారి కార్యక్రమాల్లో భాగంగా నిర్వహిస్తున్న సామాజిక సమతా సంకల్ప యాత్ర కార్యక్రమాల నిర్వహణ, సంఘాల భాగస్వామ్యంపై జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని నగర పాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఈ నెల 11వ తేదీ వరకు వార్డు సచివాలయ స్థాయిలో అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేయడం, సంతకాల సేకరణ, మారథాన్ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఎంఎం గోపి, డీవీఎంసీ సభ్యులు బాబు, దేవరాజులు, ఎల్లప్ప, డేవిడ్, రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

వార్డు కార్యదర్శులతో కమిషనర్ సమీక్ష

చిత్తూరు, జనవరి 9: వార్డు సచివాలయ స్థాయిలో నిర్వహించాల్సిన పలు కార్యక్రమాలపై నగర కమిషనర్ అరుణ మంగళవారం వార్డు కార్యదర్శులు, ఆర్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆడుదాం ఆంధ్రా, జగనన్న ఆరోగ్య సురక్ష-2పై వార్డు కార్యదర్శులకు మార్గనిర్దేశం చేశారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల కార్యక్రమాలను చేపట్టాలన్నారు. బుధవారం 43, 12 వార్డు సచివాలయాల్లో జరిగే వైద్య శిబిరాల నిర్వహణ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. వైద్యశిబిరానికి హాజరయ్యే వారికి అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీఎంఎం గోపి, తదితరులు పాల్గొన్నారు.

మీ భవిష్యత్తుకు చంద్రబాబు గ్యారెంటీ

గుడిపాల, జనవరి 9: రాష్ట్ర ప్రజల భవిష్యత్తుకు చంద్రబాబు నాయుడు గ్యారెంటీ అని మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్ అన్నారు. మంగళవారం మండలంలోని నంగమంగళం, గట్రాళ్ళమిట్ట పంచాయతీల్లో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ టీడీపీకి ఓటువేసి చంద్రబాబును ముఖ్యమంత్రి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన ఎమ్మెల్యే ఆరణి



చిత్తూరు, జనవరి 9: చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మంగళవారం సీఎం జగన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. రెండు రోజుల క్రితం సీఎంవో నుంచి ఆరణి శ్రీనివాసులుకు పిలుపురావడంతో కుమారుడితో కలిసి అమరావతికి వెళ్లిన ఆయన సీఎంను కలిశారు.

నేటి నుంచి ఆడుదాం ఆంధ్రా..

మున్సిపల్ స్థాయి పోటీలు

చిత్తూరు, జనవరి 9: వార్డు స్థాయిలో విజయవంతంగా జరిగిన ఆడుదాం ఆంధ్రా పోటీల్లో గెలుపొందిన వారితో మున్సిపల్ స్థాయి పోటీలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నట్లు నగర కమిషనర్ అరుణ చెప్పారు. ఆడుదాం ఆంధ్రా మున్సిపల్ స్థాయి పోటీలను విజయవంతం చేయడంలో భాగంగా మంగళవారం ఆర్డీవో చిన్నయ్యతో కలిసి ఆమె నగరపాలక కార్యాలయంలో జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. కమిషనర్ మాట్లాడుతూ మున్సిపల్ స్థాయి పోటీలు నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లను పూర్తి చేశామని తెలిపారు.